మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 19-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 110 Issue: 110

19 అక్టోబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 5:48 తిథి త్రయోదశి మ. 1:53 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) సా. 5:46 వరకు తరువాత హస్త యోగం ఇంద్ర రా. 1:55ం వరకు కరణం వణిజ మ. 1:53 వరకు విష్టి రా. 2:47ం వరకు వర్జ్యం తె. 3:04 నుండి తె. 4:50 వరకు దుర్ముహూర్తం సా. 4:15 నుండి సా. 5:01 వరకు రాహుకాలం సా. 4:21 నుండి సా. 5:48 వరకు యమగండం మ. 12:01 నుండి మ. 1:27 వరకు గుళికాకాలం మ. 2:54 నుండి సా. 4:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 9:57 నుండి ఉ. 11:42 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:24 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# భారత్ బంగారం!

### భారీగా పసిడిని కొంటున్న ఇండియా
### ఆర్బీఐ వద్ద రూ.9 లక్షల కోట్ల బంగారం నిల్వ
### విదేశీ మారక నిల్వలో పసిడి వాటా 14.7 శాతం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు జరుపుతోంది. ఇప్పుడు చరిత్రలో తొలిసారి భారత్‌లో బంగారం నిల్వలు 100 బిలియన్ డాలర్ల మార్కు(రూ.9 లక్షల కోట్లు)ను అధిగమించాయి. చరిత్రలో ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి.




న్యూఢిల్లీ: ఈ మేరకు ఆర్బీఐ.. ఇటీవల విదేశీ మారకపు నిల్వలకు సంబంధించిన డేటా విడుదల చేసింది. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతుండటం వల్ల కూడా ఆర్బీఐ గోల్డ్ కొనుగోలు చేస్తోంది. మొత్తం భారత్‌లో బంగారం నిల్వలు ఇటీవల వారం వ్యవధిలోనే 3.595 బిలియన్ డాలర్లు పెరిగి విలువ అక్టోబర్ 10 నాటికి 102.365 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది భారత కరెన్సీలో చూస్తే.. -2 వ పేజీలో...

# షాపుల్లో సింగారం!

### ధనత్రయోదశి వేళ వెల్లువెత్తిన బంగారం కొనుగోళ్లు!
### ధరలు తగ్గడంతో షాపులకు పోటెత్తిన జనం
### ఈ సీజన్‌లో50,000 కోట్లు దాటనున్న అమ్మకాలు

ధనత్రయోదశి పర్వదినం వేళ పసిడి, వెండి ధరలు కాస్త దిగిరావడంతో కొనుగోలుదారులు పండగ చేసుకుంటున్నారు. శనివారం ఉదయం నుంచే దేశవ్యాప్తంగా జ్యువెలరీ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.



హైదరాబాద్/న్యూఢిల్లీ: తాజాగా ధరలు తగ్గడంతో ఇదే మంచి అవకాశంగా భావించి చాలామంది వ్యూహాత్మకంగా కొనుగోళ్లు జరిపారు. ఈ పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా రూ. 50,000 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాల అమ్మకాలు జరుగుతాయని అఖిల భారత రత్నాలు, ఆభరణాల దేశీయ మండలిఅంచనా -2 వ పేజీలో...



# మద్యం దరఖాస్తుల గడువు 23 వరకు పెంపు

### 27న లక్కీడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్లపై బంద్ నేపథ్యంలో శనివారం బ్యాంకులు పనిచేయకపోవడంతో డీడీలు సమర్పించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, గడువు పెంచాలని వ్యాపారుల నుంచి వినతులు రావడంతో ఈ నెల 23 వరకు గడువు పెంచాలని శనివారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను 27న నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. అంతకుముందు మొదట నిర్ణయించిన ప్రకారం దరఖాస్తుల సమర్పణకు శనివారమే తుది గడువు కావడంతో పెద్దసంఖ్యలో వ్యాపారులు ఎక్సైజ్ తరువాయి 2 వ పేజీలో...



# బంద్ సంపూర్ణం

## బీసీ సంఘాల బంద్‌కు అన్ని పార్టీల మద్దతు

### తెల్లవారుజామునే బస్టాండ్‌కు చేరుకున్న బీసీ నేతలు
### డిపోలకే పరిమితమైన బస్సులు
### స్వచ్ఛందంగా విద్యాసంస్థల మూసివేత
### మధ్యాహ్నం తర్వాత తెరుచుకున్న వాణిజ్య సముదాయాలు

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలంగాణ బంద్ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం అయ్యింది. ఈ బంద్ తెలంగాణ ఉద్యమం నాటి రోజులను గుర్తుకు తెచ్చింది. బంద్‌తో బస్సులన్నీ డిపోలకే పరిమితం అయ్యాయి. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అన్ని జిల్లాల్లో తెల్లవారుజామున 5 గంటల నుంచే బీసీ సంఘాలు, పార్టీల నాయకులు రోడ్డుపైకి వచ్చేశారు. బస్టాండ్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యాసంస్థలు ముందుగానే బంద్‌కు మద్దతుగా పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలు కూడా మధ్యాహ్నం వరకు మూసివేశారు. ఆ తరువాత సగానికిపైగా దుకాణాలను తెరిచారు. మెడికల్ దుకాణాలు, ఆస్పత్రులను తెరిచారు. ఆటోలు అందుబాటులో ఉన్నాయి. అసలే దీపావళి పండుగ సీజన్ కావడంతో బంద్ కారణంగా వస్త్ర, కిరాణం, మార్ట్ వ్యాపారులు ఇబ్బంది తరువాయి 2 వ పేజీలో...



# గ్రూప్2 అభ్యర్థులకు.. నియామక పత్రం

## ఉద్యోగులే తెలంగాణ ఆశ

### ప్రభుత్వ ఉద్యోగులుగా పేదలకు అండగా నిలవాలి
### రైజింగ్ తెలంగాణ 2047లో భాగస్వాములు కండి
### గ్రూప్-2 విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం
### శిల్పారామంలో నియామక పత్రాల అందజేత

ప్రభుత్వ ఉద్యోగులే తెలంగాణ ఆశ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన 783 జాబ్స్ లో ఎంపికైన గ్రూప్ 2 అభ్యర్థులకు నియమాక పత్రాలను అందజేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన వాళ్లు ఒక్కక్షణం కూడా నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదన్నారు. అమరుల ఆశయ సాధనపై వాళ్లు ఆలోచన చేసి ఉంటే మీకు ఎనిమిదేళ్ల క్రితమే ఉద్యోగాలు వచ్చేవన్నారు.

శిల్పారామం/హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు):వాళ్ల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పదిహేనేళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ జరగలేదు అంటే.. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా? అంటూ బీఆర్ఎస్ సర్కారుపై మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలను అందిస్తున్నామని, తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములను చేసే బాధ్యత టీజీపీఎస్సీ తీసుకుందన్నారు. మీరు, మేము వేరు కాదు.. మీరే మేము.. మేమే మీరు అంటూ వారి బాధ్యతలను గుర్తు చేశారు. చీకటి రోజులు పోవాలి.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని గ్రూప్ 1 విషయంలో సమస్యలన్నింటినీ ఎదుర్కొని నియామక పత్రాలు అందజేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు తరువాయి 2 వ పేజీలో...

# పెద్దోళ్లు పలాయనం

### జాడలేని రేవంత్, కేటీఆర్, హరీశ్,రాంచందర్ రావు.. బీసీ బంద్‌లో అంతా ద్వితీయ శ్రేణి నాయకులే

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌లో శనివారం బీసీ జేఏసీ చేపట్టిన బీసీ బంద్‌కు పార్టీల పెద్దలు రాకపోవడం గమనార్హం. రాష్ట్రమంతా బంద్‌లో పాల్గొంటే పేరు మోసిన నాయకులు మాత్రం ఎక్కడా ఆందోళనల్లో పాల్గొనలేదు.

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని చెబుతూ వస్తున్న పార్టీల పెద్ద స్థాయి నేతలు ఆందోళనల్లో ఎక్కడా కనిపించలేదు. ఆర్ కృష్ణయ్య స్వయంగా అన్ని పార్టీల చీఫ్‌లను కలిసి బంద్ కు మద్దతు కోరారు. అందరూ పూర్తి మద్దతు ప్రకటించారు. అయితే శనివారం నాటి బంద్‌లో సీఎం రేవంత్ రెడ్డి కనిపించలేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొనలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ తదితరులు మాత్రమే పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, బీజేఎల్పీ నాయకుడు మహేశ్వర్ రెడ్డి కూడా ధర్నాల వైపు కన్నెత్తి చూడలేదు. రేవంత్ రెడ్డి సామాజిక వర్గం, హరీశ్ రావు, కేటీఆర్ వెలమ సామాజిక వర్గం, రాంచందర్ రావు బ్రాహ్మణ సామాజిక వర్గం కావడం వల్లే బంద్‌లో పాల్గొనలేదని జోరుగా చర్చ జరుగుతోంది.

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,086 |
| వెండి (గ్రాము): | రూ.190 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,555 |


## విశ్వవాణి



ఎవరెస్ట్‌పై దాదాపు 300 మృతదేహాలు పడి ఉన్నాయి. ఎవరెస్ట్‌పై ఉండే చల్లని వాతావరణం వల్ల అవి కుళ్లిపోవడం లేదు. సరే పోనీ.. వాటిని కిందికి తీసుకొద్దామన్నా, చాలా ప్రమాదం. పైగా ఖర్చుతో కూడుకున్నది. అందుకే ఆ మృతదేహాలు అలా పడి ఉంటాయి అంతే. ఎవరెస్టును అధిరోహించేందుకు వెళ్లేవారు ఆ మృతదేహాలను చూసుకుంటూ వెళ్లడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి.

# నిండు గర్భిణిపై మామ కర్కశత్వం

### గొడ్డలితో నరికి చంపిన కిరాతకుడు
### కుమ్రం భీం జిల్లాలో పరువు హత్య



కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): కుమ్రం భీం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. దహేగాం మండలం గిరివెల్లి గ్రామంలో పరువు హత్య జరిగింది. కొడుకు కులాంతర వివాహం చేసుకున్నాడని 8 నెలల గర్భిణి అయిన కోడలిని గొడ్డలితో చంపాడు మామ. శనివారం (అక్టోబర్ 18) జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గత ఏడాది శివార్ల శేఖర్, తలండి రాణి ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం ఇష్టం లేని -2వ పేజీలో...



# టాపాసులు పేలి కోటి నష్టం

### బాణసంచా దుకాణంలో అగ్ని ప్రమాదం.. సంగారెడ్డి జిల్లాలో ఘటన

ఆందోల్, అక్టోబర్ 18 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, సంగుపేట గ్రామ శివారులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. టపాసుల ప్యాకింగ్ పేపర్ల వ్యర్థాల్లో ప్రమాదవశాత్తు నిప్పురవ్వ పడటంతో మంటలు చెలరేగి ఈ దుర్ఘటన జరిగింది. కటకం వేణుగోపాల్ అండ్ సన్స్ హెూల్‌సేల్ అండ్ రిటైల్ టపాసుల దుకాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గోదాం ఆవరణలో ఏర్పాటు చేసిన హెూల్‌సేల్ అండ్ రిటైల్ దుకాణాలకు మంటలు తరువాయి 2 వ పేజీలో...



# పాక్ కీచక పర్వం

### అఫ్ఘనిస్థాన్‌పై వైమానిక దాడి.. దాడిలో ముగ్గురు అఫ్ఘన్ క్రికెటర్స్ మృతి

కాబూల్: పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ మధ్య ఘర్షణలు మరింత ఉద్రిక్తంగా మారాయి. తాజాగా, పాక్ వాయుసేన జరిపిన దాడిలో ముగ్గురు యువ అఫ్ఘన్ క్రికెటర్స్‌తో పాటు 8 మంది పౌరులు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాక్ వాయుసేన అఫ్ఘనిస్తాన్‌లోని ఈస్టర్న్ పాక్టికా ప్రావిన్స్‌పై దాడి చేసింది. అక్కడ ఓ క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

19.10.2025

మేషం: వ్యాపారాలలో ఆశించిన లాభాలు పొందుతారు. కీలక సమయంలో ఆత్మీయుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి. చాలకాలంగా పూర్తికాని పనులు పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

వృషభం: ఉద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయట బాధ్యతలు ఒత్తిడికి గురిచేస్తాయి. నూతన రుణాలు చేయవలసి రావచ్చు. వ్యాపార విషయంలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. వృత్తి, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు.

మిధునం: వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలు తప్పవు. ముఖ్యమైన పనులలో శ్రమకు తగిన ఫలితం ఉ ఒడదు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవ దర్శనం చేసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపారమునా సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: వ్యాపారాల విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో జీతభత్యాలు విషయంలో అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మరింత పుంజుకుంటుంది.

సింహం: భూ సంబంధిత వివాదాలు మరింత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. మానసిక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ నిర్వహణలో లోపం వలన అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

కన్య: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక వృద్ధి, పాత ఋణాలు తీర్చగలుగుతారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు తగిన అవకాశాలు లభిస్తాయి.

తుల: ఉద్యోగమున అధికారులతో వాదాలకు వెళ్లకపోవడం మంచిది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటాబయట సమస్యలు అధికమవుతాయి. వృత్తి వ్యాపారాలలో తొందరపడి సొంత నిర్ణయాలు తీసుకుని నష్టపడతారు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. కీలక సమయంలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి శు భకార్య ఆహ్వానాలు అందుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శు భకార్యాలు నిర్వహిస్తారు.

మకరం: వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికామౌతుంది. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నూతన ఋణ యత్నాలు కలసిరావు. ఆర్థిక వ్యవహారాలు గందరగోళంగా ఉ ఒటాయి. పుణ్యక్షేత్ర దర్శనాలు చేసుకుంటారు.

కుంభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులు వ్యయ ప్రయాసలుతో కాని పూర్తికావు. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ఇంటా బయట ప్రతికూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

మీనం: వ్యాపారపరంగా కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశములు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో తీసుకున్న నిర్ణయాలు తరువాత కాలానికి ఉ పయోగపడతాయి.

# బంద్ సంపూర్ణం

మొదటి పేజీ తరువాయి

పడ్డారు. మొత్తంగా బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలికారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు మద్దతు తెలపడంతోపాటు బంద్‌లో పాల్గొన్నాయి. శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. పండగ సమయంలో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



### ప్రైవేట్ వాహనాల దందా

ఆర్టీసీ బస్సులు రోడ్కెక్కకపోవడంతో ప్రైవేటు వాహనాలు అక్రమ వసూళ్ల దందాకు తెరలేపాయి. పలుచోట్ల ప్రయాణికుల వద్ద భారీ మొత్తంలో రవాణా చార్జీలు వసూలు చేశాయి. జూబ్లీ బస్టాండ్ వద్ద కరీంనగర్, సిద్దిపేట, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల నుంచి, ఎంజీబీఎస్ వద్ద, నిజామాబాద్ వైపు వెళ్లే మేడ్చల్ వద్ద ప్రైవేట్ వాహనాల నిర్వాహకులు భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లో క్యాబ్‌లు, ఆటోలు సైతం భారీ వసూళ్లకు పాల్పడినట్లు నగరవాసులు వాపోయారు.

### రిజర్వేషన్‌పై న్యాయవ్యవస్థలు దిగి రావాలి: ఆర్ కృష్ణయ్య

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై నిర్వహించిన బీసీ బంద్ విజయవంతం అయిందని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం బీసీ బంద్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థలు, ఆర్టీసీ, వ్యాపార సంస్థలు పూర్తిగా బంద్ చేసి మద్దతు ప్రకటించారని తెలిపారు. బీసీ బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని వెల్లడించారు. రాజకీయంగా విభేదాలు ఉన్నా.. అది పక్కన పెట్టి బీసీల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, టీజేఎస్‌తో పాటు అనేక మంది ప్రముఖులు కల్వకుంట్ల కవిత, మందకృష్ణ మాదిగ, విశారాధన్ మహారాజ్, కుల సంఘాలు, లాయర్లు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారని వివరించారు. ఈ సందర్భంగా బీసీల డిమాండ్ న్యాయమని మద్దతిచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వెల్లడించారు. బీసీ కులాలకు గౌరవం, పేదరిక నిర్మూలన కోసం పోరాటం చేస్తున్నామని, 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై న్యాయ వ్యవస్థలు దిగివస్తాయని నమ్ముతున్నామని ఆకాంక్షించారు.

### సంక్షోభం సృష్టిస్తేనే రిజర్వేషన్లు: కవిత

'దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీ పార్టీలు ఈ బంద్‌కు మద్దతు తెలపడం అంటే హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్టు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు నడుచుకుంటూ వస్తది. రాజకీయ సంక్షోభం సృష్టిస్తేనే బీసీల రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుంది' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

### చిత్తశుద్ధి అంటే మాదే: టీపీసీసీ చీఫ్

బీసీ సంఘాలు చేపట్టిన బంద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బీసీ బంద్‌కు మద్దతుగా అంబర్‌పేట్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ బంద్‌లో మంత్రులు అందరూ పాల్గొంటున్నారని తెలిపారు. ఉదయం నుంచి అందరితో తాను మానిటరింగ్ చేస్తున్నానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోయాయని తెలిపారు. తాము అడుగుతున్న కోరిక న్యాయమైనది కాబట్టే ప్రజలకు కూడా బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమకు ఉన్నంత చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదన్నారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్ల అమలుకు జీవో ఇచ్చాయని అన్నారు.

### రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదు: ఈటల

సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్ స్టేషన్ వద్ద నిర్వహించిన బంద్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారని, బీసీ రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసి కూడా బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయితీగా రిజర్వేషన్లు అమలు చేసిందని, పెరియార్ మొదలు అనేక గొప్ప ఉద్యమాలు జరిగాయని గుర్తుచేశారు. 21 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో రెండేళ్ల పాటు బీసీల ఆర్థిక, సామాజిక, విద్య అన్ని రంగాలపై సమగ్ర సర్వే చేసి.. ఆ రిపోర్టుతో రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ లో చేర్చారని తెలిపారు.



## భారత్ బంగారం!

మొదటి పేజీ తరువాయి

ఏకంగా రూ. 9 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. అయితే ఇక్కడ బంగారం నిల్వలు పెరిగినా.. ఓవరాల్‌గా విదేశీ మారకం నిల్వలు మాత్రం తగ్గాయి. ఇది 2.18 బిలియన్ డాలర్లకుపైగా తగ్గి 697.784 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మొత్తం ఫారెన్ ఎక్స్చేంజ్ రిజర్వ్‌ల్లో బంగారం నిల్వలు 14.7 శాతానికి చేరగా.. 1996-97 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. గత దశాబ్ద కాలంలో భారత్.. బంగారం నిల్వల్ని వేగంగా పెంచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో విదేశీ మారకంలో అప్పుడు 7 శాతంగా ఉండగా.. ఇప్పుడు రెట్టింపు చేస్కొని ఏకంగా 15 శాతానికి పెంచుకోవడం విశేషం. ఇది కేంద్ర బ్యాంక్ బంగారం కొనుగోలు చేయడాన్ని.. ధరల పెరుగుదలను ప్రతిబింబిస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

## మద్యం దరఖాస్తుల గడువు 23 వరకు పెంపు

మొదటి పేజీ తరువాయి

కార్యాలయాలకు తరలివచ్చారు. గత నెల 26న దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ప్రారంభం కాగా... శుక్రవారం వరకు సుమారు 50 వేల దరఖాస్తులు వచ్చాయి. శనివారం రాత్రి 11 గంటల వరకు మరో 37 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. సాయంత్రం 5 గంటలకు ఆబ్కారీ కార్యాలయాలకు వచ్చిన వ్యాపారులకు టోకెన్లు ఇచ్చి మరీ రాత్రి వరకు దరఖాస్తులను స్వీకరించారు.

## నిండు గర్భిణిపై మామ కర్కషత్వం

మొదటి పేజీ తరువాయి

తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. అయినప్పటికీ ప్రేమించిన యువతినే పెళ్లి చేసుకుని తన ఇంట్లోనే కాపురం పెట్టాడు. మొదట్లో వ్యతిరేకించినా.. మెల్లమెల్లగా అర్థం చేసుకుంటారులే అనుకున్నారు నవ దంపతులు. అయితే ఏడాది గడుస్తున్నా తండ్రి మనసులో పరువు పోయిందనే భావన తగ్గలేదు. కులదురహంకారంతో రగిలిపోతున్న తండ్రి శివార్ల సత్తయ్య.. ఎవరూ లేని సమయం చూసి నిండు చూలాలిని చంపేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమంయలో కోడలు తలండి రాణి (23) ని గొడ్డలి తో నరికి హత్య చేశాడు. రాణి ఇటీవలే గర్భం దాల్చింది. పాపో బాబో పుడితే వారసులను చూసైనా మారుతారులే అనుకున్న ఆమె ఆశలు అడియాశలయ్యాయి. ప్రేమించిన వాడి కోసం కన్న తల్లిదండ్రులను, బంధువులను వదిలి వచ్చిన ఆమె మనసును అర్థం చేసుకోలేని మామ.. కులం భావనతో కళ్లు మూసుకుపోయిన అహంకారంతో ఎనిమిది నెలల గర్భవతిని చంపేశాడు. తలండి రాణి హత్య గురించి తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరువు హత్యగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రూప్2 అభ్యర్థులకు నియామక పత్రం

మొదటి పేజీ తరువాయి

భర్తీ చేశామన్నారు. గత పాలకులు ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో మాపై బురద జల్లే ప్రయత్నం చేశారన్నారు. అలాంటి ఏ వ్యవస్థ మాకు లేదు.. మా వ్యవస్థనే మీరు.. ఆ వ్యవస్థలో మీరే మా కుటుంబ సభ్యులన్నారు. ఇప్పటి వరకు మీరు సామాన్యులు.. ఈ రోజు నుంచి మీరు ఆఫీసర్స్ అంటూ వారి గురుతర బాధ్యతల్ని గుర్తు చేశారు. మీ బాధ్యతను సమర్థంగా నిర్వహించి రైజింగ్ తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా పనిచేయాలన్నారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలన్నారు. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దన్నారు. నిస్సహాయులకు సహాయం చేయండి.. పేదలకు అండగా నిలవాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. గత పాలకుల పాపాల పుట్ట పలుకుతోంది .. దేశంలోనే తెలంగాణను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలన్నారు. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దన్నారు. నిస్సహాయులకు సహాయం చేయండి.. పేదలకు అండగా నిలవండన్నారు. గత పాలకుల పాపాల పుట్ట పలుకుతోందన్నారు. బీఆర్ఎస్ దోపిడీ గురించి మేం చెప్పడం కాదు.. వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారన్నారు. హాస్టల్స్ లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే వాళ్లు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. సెంటిమెంట్‌తో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. అలాంటి వారి పట్ల మీరు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా, ఫుడ్ పాయిజన్ తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులు సమర్థంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్య క్రమంలో ఉ పముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### అధికారులపై సీఎం ఆగ్రహం

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారుల్ని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. అన్ని విభాగాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగ అధిపతులను హెచ్చరించారు సీఎం రేవంత్. ' ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయినప్పటికీ కొందరు అధికారుల పనితీరులో మార్పు లేదు.ఇప్పటికైనా అలసత్వం వీడండి. ఎవరికివారు సొంత నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు. అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ముందుగా ప్రాధాన్యమివ్వాలి. అన్ని విభాగాల కార్యదర్శుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సీఎస్ సమీక్షించాలి. ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలి. ఎక్కడ కూడా ఫైలు ఆగిపోవడానికి, పనులు ఆగిపోవడానికి వీల్లేదు. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావాల్సిన నిధులను రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టఘి. ఏయే పథకాల్లో రాష్ట్ర వాటా చెల్లిస్తే, కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందో, వాటికి ముందుగా ప్రాధాన్యమివ్వండి. ఇకపై సీఎస్ తో పాటు సీఎంవో అధికారులు తమ పరిధిలోని విభాగాలపై ప్రతి వారం తనకు నివేదికలు అందించాలి. నేనే స్వయంగా వాటిపై సమీక్ష నిర్వహిస్తా' అని పేర్కొన్నారు.

## టాపాసులు పేలి కోటి నష్టం

మొదటి పేజీ తరువాయి

వ్యాపించాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో పాటు దట్టమైన పొగలు అలుముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



## పాక్ కీచక పర్వం

మొదటి పేజీ తరువాయి

వెళ్ళిన హరూన్, కబీర్ అఘా, సిగ్బతుల్లా ముగ్గురు క్రికెటర్లు తిరుగు ప్రయాణం అవుతున్నప్పుడు పాక్ దాడి చేయడంతో చనిపోయారు. తమ దేశంపై పాకిస్తాన్ వైమానిక దాడులు చేస్తుండటాన్ని అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తాము కూడా ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరించింది. అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు తమ క్రికెటర్ల మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ, వచ్చే నెలలో పాకిస్తాన్, శ్రీలంకతో జరిగే ముక్కోణపు సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. తమ క్రికెటర్లు, పౌరుల మృతికి కారణమైన పాకిస్తాన్ ఈ సిరీస్‌లో పాల్గొంటున్నందునే తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించింది.

## షాపుల్లో సింగారం!

మొదటి పేజీ తరువాయి

వేస్తోంది. గతేడాదితో పోలిస్తే కొనుగోళ్ల పరిమాణం (వాల్యూమ్) 10 నుంచి 15 శాతం తగ్గినా, విలువ పరంగా అమ్మకాలు గణనీయంగా పెరిగాయని జీజేసీ చైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు. 'బంగారం, వెండి ధరలు అధికంగా ఉన్నప్పటికీ, వినియోగదారుల్లో ఉత్సాహం తగ్గలేదు. చాలామంది పెళ్లిళ్ల కోసం ముందుగానే కొనుగోళ్లు చేస్తున్నారు' అని వివరించారు. ఈసారి కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఉన్న బంగారు నాణేలు, తేలికపాటి ఆభరణాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని రాజేశ్ రోక్డే పేర్కొన్నారు. ముఖ్యంగా వెండి వస్తువుల అమ్మకాలు గతేడాది కన్నా ఏకంగా 40 శాతం పెరిగాయని, వెండి నాణేలు, పూజా సామాగ్రిని ఎక్కువగా కొంటున్నారని ఆయన అన్నారు. వినియోగదారుల కొనుగోలు తీరులో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని జీజేసీ వైస్ చైర్మన్ అవినాశ్ గుప్తా తెలిపారు. 'గతేడాదితో పోలిస్తే ఒక్కో లావాదేవీ సగటు విలువ 20-25 శాతం పెరిగింది. ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో బడ్జెట్ ఫ్రెండ్లీ పెట్టుబడిగా, బహుమతులుగా ఇచ్చేందుకు వెండి నాణేల కొనుగోళ్లు 35-40 శాతం పెరిగాయి' అని వివరించారు. యువత తమ వ్యక్తిగత విజయాలకు గుర్తుగా తేలికపాటి ఆభరణాలు కొనుక్కోవడం కూడా 15 శాతం పెరిగిందని ఆయన చెప్పారు. పండగ రద్దీని దృష్టిలో ఉ ంచుకుని చాలా దుకాణాలు ఉదయాన్నే తెరుచుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ధంతేరాస్ ముహూర్తం ఉ ండటంతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆశిస్తున్నారు.

## విద్య, ఉద్యోగవాణి

### డీసీసీబీలో బ్యాంకులో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు: 43
దరఖాస్తు తేదీలు: అక్టోబర్ 18- నవంబర్ 06 వరకు
పరీక్ష విధానం: రాత పరీక్ష ద్వారా
పరీక్ష తేదీ: డిసెంబర్‌లో నిర్వహించనున్నారు
వెబ్‌సైట్: https://karimnagardccb.org

### కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు: 225
దరఖాస్తు తేదీలు: అక్టోబర్ 18- నవంబర్ 06 వరకు
వయోపరిమితి: 18-30 ఏళ్ల మధ్య గలవారు
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులైనవారు
వెబ్‌సైట్:https://tgcab.bank.in/notifications

### నార్త్ ఈస్టర్ రైల్వేలో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు: 1,104
అర్హత: టెన్త్, ఐటీఐ ఉత్తీర్ణులైనవారు
వయోపరిమితి: 15-24 ఏళ్ల మధ్య గలవారు
దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 15,2025 వరకు
దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు, ఇతరులకు రూ.100
వెబ్‌సైట్: https://ner.indianrailways.gov.in/





# ఆటోలో కవిత.. బంద్‌లో కొడుకు

**బీసీ బంద్‌కు మద్దతుగా కవిత మానవహారం.. ఆటోలో వచ్చి ఖైరతాబాద్ చౌరస్తాలో ధర్నా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కావాలని డిమాండ్**

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ల కోసం జరుగుతున్న బంద్‌లో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత... కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీల హక్కుల కోసం పోరాడుతున్నామని చెబుతూ అవే పార్టీలు బంద్‌లో పాల్గొనడం "హంతకులే నివాళులు అర్పించినట్లు" ఉందని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ చౌరస్తాలో బీసీ బంద్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన మానవహారంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కవిత తన జాగృతి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆటోలో రావడం గమనార్హం. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత, రాష్ట్రంలోని బీసీలు తమకు 42 శాతం రిజర్వేషన్లు కావాలని ఎప్పటినుంచో కోరుతున్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీలు బీసీ బిడ్డలను మోసం చేస్తూనే ఉన్నాయని ఆమె ఆరోపించారు. ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అవసరమైతే, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో బీసీ ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆమె స్పష్టం చేశారు. తమిళనాడులో బీసీ రిజర్వేషన్ల కోసం పదేళ్ల పాటు ఎన్నికలు జరగలేదన్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ఐదు నెలలు ఎన్నికలు ఆలస్యమైనా నష్టం లేదని, బీసీలకు న్యాయం జరగడమే ముఖ్యమని కవిత పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

### బీసీ బంద్‌లో కవిత కుమారుడు

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు ఆమె కుమారుడు ఆదిత్య బంద్‌లో పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని నినదించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆదిత్య నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్ల కోసం కేవలం తన తల్లి ఒక్కరే పోరాడితే సరిపోదని, రాష్ట్రంలోని బీసీలు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ బయటకు వచ్చి పోరాడాలని ఆదిత్య కోరారు.

## అమెరికాలో మంచిర్యాల తల్లీకూతురు దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన తల్లీకూతుళ్లు దుర్మరణం చెందారు. పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా టిప్పర్ ఢీకొనడంతో తల్లి రమాదేవి, కుమార్తె తేజస్వి అక్కడికక్కడే మృతి చెందారు. మంచిర్యాల పట్టణానికి చెందిన విశ్రాంత సింగరేణి కార్మికుడు విఘ్నేశ్ కు స్రవంతి, తేజస్వి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగి అమెరికాలో స్థిరపడ్డారు. తేజస్వి గృహప్రవేశం కోసం గత నెల 18న విఘ్నేశ్ తన భార్య రమాదేవితో కలిసి అమెరికా వెళ్లారు. శుక్రవారం పెద్ద కుమార్తె కుమారుడు నిశాంత్ పుట్టినరోజు కావడంతో విఘ్నేశ్, రమాదేవి, తేజస్వి కారులో స్రవంతి ఇంటికి వెళ్లారు. శనివారం వారు తిరుగు ప్రయాణమయ్యారు. దురదృష్టవశాత్తూ వారి కారును ఒక టిప్పర్ ఢీకొనడంతో రమాదేవి, తేజస్వి మృతి చెందగా, ఇతర కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి.

## జూబ్లీహిల్స్‌కు 40 మంది కాంగ్రెస్ స్టార్లు

**స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల**



జూబ్లీహిల్స్, అక్టోబర్ 18 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఈ జాబితాలో తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు విజయశాంతి, దానం నాగేందర్ పేరు కూడా ఉంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. అందులో, 1. మీనాక్షి నటరాజన్, 2. రేవంత్ రెడ్డి, 3. మహేశ్ కుమార్ గౌడ్, 4. పి. విశ్వనాథన్, 5. మల్లు భట్టి విక్రమార్క, 6. ఉత్తమ్ కుమార్ రెడ్డి, 7. దామోదర రాజనర్సింహ, 8. వంశీచంద్ రెడ్డి, 9. శ్రీధర్ బాబు,10, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, 11. పొన్నం ప్రభాకర్, 12. సీతక్క, 13. కొండా సురేఖ, 14. తుమ్మల నాగేశ్వరరావు, 15. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, 16. జూపల్లి కృష్ణారావు, 17. వివేక్, 18. అడ్లూరి లక్ష్మణ్ కుమార్, 19. శ్రీహరి ముదిరాజ్, 20. రేణుకా చౌదరి, 21. సంపత్ కుమార్, 22. వి. హనుమంత రావు, 23. అజారుద్దీన్, 24. జానారెడ్డి, 25. షబ్బీర్ అలీ 26. మధుయాష్కీ గౌడ్, 27. విజయశాంతి, 28. అంజన్ కుమార్ యాదవ్, 29. బల్‌రాం నాయక్, 30. మల్లు రవి, 31. చామల కిరణ్ కుమార్ రెడ్డి, 32. అనిల్ కుమార్ యాదవ్, 33. జెట్టి కుసుమ్ కుమార్, 34. దానం నాగేందర్, 35. రాములు నాయక్, 36. సునీతా ముదిరాజ్, 37. జక్కిడి శివచరణ్ రెడ్డి, 38. యెడవల్లి వెంకటస్వామి, 39. సీ.ఎన్. రెడ్డి, 40. బాబా ఫసీయుద్దీన్ ఉన్నారు.

## యూట్యూబ్ ఛానళ్లపై పోక్సో చట్టం కింద కేసు

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): మైనర్ పిల్లలతో అసభ్యకరమైన కంటెంట్ రూపొందించిన రెండు యూట్యూబ్ ఛానళ్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ విషయాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనార్ 'ఎక్స్' వేదికగా తెలియజేశారు. సంబంధిత యూట్యూబ్ ఛానళ్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూట్యూబ్ ఛానళ్లకు ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో స్వేచ్ఛ ఉంది కదా అని ఏ తరహా కంటెంట్ అయినా సృష్టిస్తామంటే కుదరదని ఆయన స్పష్టం చేశారు. చట్ట ప్రకారం బాధ్యులపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన తేల్చి చెప్పారు. కాగా, వీక్షకుల వ్యామోహంలో విలువలను విస్మరించకూడదని సజ్జనార్ రెండు రోజుల క్రితం సూచించారు. కేవలం వ్యూస్, లైక్‌ల కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందడానికి చిన్నారుల భవిష్యత్తును పణంగా పెట్టడం సముచితం కాదని ఆయన హితవు పలికారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ రూపొందించడం పట్ల ఆయన గత కొన్ని రోజులుగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్వాడీలో సంపులో పడి బాలుడి దుర్మరణం

గచ్చిబౌలి/హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): అంగన్వాడీ కేంద్రంలో ఓ నాలుగేళ్ల ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ సంపులో పడిపోయాడు. ఆయా కానీ, టీచర్ కానీ గమనించకపోవడంతో ఊపిరాడక మరణించాడు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా యాలల ప్రాంతానికి చెందిన బోయిని పరమేశ్వర్ గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీలో నివాసం ఉంటున్నారు. పరమేశ్వర్ కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నానక్ రామ్ గూడాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా చిన్న కుమారుడు నిఖిల్ తేజ్(4)ను అంగన్వాడీ కేంద్రానికి పంపిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నిఖిల్ తేజ్ ను తీసుకురావడానికి వెళ్లిన ఆటో డ్రైవర్ కు అంగన్వాడీ కేంద్రంలో బాలుడు కనిపించలేదు. దీంతో అతడు పరమేశ్వర్ కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే పరమేశ్వర్ అంగన్వాడీ కేంద్రానికి చేరుకుని కుమారుడి కోసం వెతకగా.. భవనం వెనక వైపు ఉన్న సంపులో నిఖిల్ తేజ్ పడి ఉండడం గుర్తించారు. వెంటనే బాలుడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. దీంతో నిఖిల్ తేజ్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## అంబర్‌పేట ర్యాలీలో పడిపోయిన వీహెచ్

అంబర్‌పేట/హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు నేడు బంద్‌కు పిలుపునిచ్చాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో బంద్‌కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎంపీ వి. హనుమంతరావుతో సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా ఫ్లెక్సీ పట్టుకుని ముందు నడుస్తున్న వి. హనుమంతరావు బ్యానర్ తట్టుకుని ఒక్కసారిగా ముందుకు పడిపోయారు.

# బీసీలు 42 కాదు 52 శాతం

**నా మాట తప్పయితే రాజకీయ సన్యాసం తీసుకుంటా**

**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు**


**తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్**



హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ల విషయంలో తాను చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, ఎక్కడైనా చర్చకు సిద్ధమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. బీసీ బంద్‌లో భాగంగా జూబ్లీ బస్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బీసీల విషయంలో అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయడం సాధ్యం కాదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారని ఈటల గుర్తుచేశారు. వాస్తవాలు తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న బీసీ జనాభా లెక్కలు పూర్తిగా తప్పులతడక అని, 52 శాతం ఉన్న బీసీలను 42 శాతంగా చూపడం కాకి లెక్కలు చెప్పడమేనని విమర్శించారు. ప్రభుత్వం నామమాత్రంగా కమిషన్లు వేస్తోందే తప్ప, వాటిని అమలు చేయడంలో నిజాయతీ చూపడం లేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా బీసీల విషయంలో ఇలాగే వ్యవహరించిందని ఈటల విమర్శించారు. కేసీఆర్ హయాంలో సర్వేలు చేసి, కమిషన్లు వేసినా చిత్తశుద్ధి లేకపోవడం వల్లే బీసీలకు న్యాయం జరగలేదని అన్నారు. "తమిళనాడులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో రెండేళ్లపాటు సమగ్ర సర్వే జరిపి, ఆ నివేదికను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం వల్లే అక్కడ రిజర్వేషన్లు పక్కాగా అమలవుతున్నాయి. తెలంగాణలో కూడా అదే విధానాన్ని పాటించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని, ఆయన కేబినెట్‌లో 27 మంది ఓబీసీ మంత్రులు ఉన్నారని ఈటల గుర్తుచేశారు. మాదిగ రిజర్వేషన్ల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. "బీసీలు యాచించే స్థాయిలో లేరు, శాసించే స్థాయికి ఎదగాలి. ప్రాంతీయ పార్టీలతో ఆ కుటుంబాలకే అధికారం దక్కుతుంది తప్ప బీసీలకు మేలు జరగదు" అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# జాతీయ పార్టీలది కపట ప్రేమ

**మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు**



హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు) : కాంగ్రెస్, బీజేపీలు బీసీలపై కపటి ప్రేమ కురిపిస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రిజర్వేషన్ల పెంపు పై ఢిల్లీలో కొట్లాడాల్సిన రెండు జాతీయ పార్టీలు బీసీలను మభ్యపెడుతూ గల్లీలో డ్రామాలు చేస్తున్నాయి.. బీసీలను అవమానిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ రెండు పార్టీలు మద్దతు ఇచ్చాక, బీసీ రిజర్వేషన్ల పెంపు ఆపే వారు ఎవరు? పార్లమెంట్‌లో బీజేపీకి 240 మంది ఎంపీలు, కాంగ్రెస్ పార్టీకి 99 ఎంపీల బలం ఉంది. రిజర్వేషన్ల బిల్లు పెంపును అడ్డుకునేది ఎవరు? ఆరుసార్లు జనాభా లెక్కింపు చేసిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు బీసీ గణన చేయలేదు. బీజేపీ అయితే ఏకంగా జనగణనను నాలుగేళ్లుగా వాయిదా వేస్తూ వస్తున్నది. గడిచిన 35 ఏళ్లల్లో ఈ దేశాన్ని కాంగ్రెస్ 15 ఏళ్లు, బిజెపి 17 ఏళ్లు పాలిస్తే ఏనాడు ఈ రెండు పార్టీలకు బీసీలు గుర్తుకు రాలేదు. కానీ ఇప్పుడు రెండు జాతీయ పార్టీలు బీసీలపై కపట ప్రేమతో నటిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఉండాలని 2005లోనే కోరిన దేశంలోనే ఏకైక నేత కేసీఆర్. రిజర్వేషన్లు పెంచాలని రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపారు. స్వయంగా ప్రధానిని కలిసి విజ్ఞప్తిచేశారు. అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చలనం రాలేదు. ఇప్పటికీ రిజర్వేషన్లు పెంచలేదు, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదు. రాహుల్ గాంధీ పార్లమెంట్లో ప్రైవేట్ మెంబర్ బిల్లు ఎందుకు పెట్టడం లేదు? కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు మిగతా బీజేపీ ఎంపీలు ఎందుకు కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు? రాజకీయ లబ్ధి పొందేందుకు ఇప్పుడు ఒకరిని మించి ఇంకొకరు నటిస్తున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపు సాధించాల్సింది పోయి కాలయాపన చేస్తున్నాయి. ఏ పార్టీ బిల్లు పెట్టినా దానికి బిఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుంది. ఎలాంటి పోరాటానికైనా బిఆర్ఎస్ కలిసి వస్తుంది. ఇప్పటికైనా గల్లీలో డ్రామాలు కట్టిపెట్టి.. ఢిల్లీ వేదికగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటం మొదలు పెట్టాలని కాంగ్రెస్, బిజెపి లను డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మొగులయ్యకు కేటీఆర్ అండ

**కంటి చూపు సమస్య.. వైద్యానికి పూర్తి భరోసా**

**హయత్‌నగర్ ఇంటి స్థలం**

**వివాదంపై రంగారెడ్డి కలెక్టర్‌కు ఫోన్**



హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ కిన్నెర వాద్య కళాకారుడు దర్శనం మొగులయ్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఆరోగ్యం, ఇంటి స్థలం సమస్యలతో ఇబ్బంది పడుతున్న మొగులయ్యకు అన్ని విధాలా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈరోజు కేటీఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన మొగులయ్య, తన కష్టాలను చెప్పుకున్నారు. ఈ సందర్భంగా మొగులయ్య యోగక్షేమాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నానని మొగులయ్య చెప్పడంతో కేటీఆర్ వెంటనే స్పందించారు. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యం అందించే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తనకు హయత్‌నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొందరు వ్యక్తులు సృష్టిస్తున్న ఇబ్బందులను మొగులయ్య కేటీఆర్‌కు వివరించారు. వారు కోర్టు కేసులతో వేధిస్తున్నారని, తాను నిర్మించుకున్న చిన్న గదిని సైతం కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తక్షణమే స్పందించిన కేటీఆర్, అక్కడికక్కడే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు కేటాయించిన భూమి విషయంలో న్యాయం చేయాలని, ఆయనకు, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని సూచించారు. న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా పార్టీ తరపున సహాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఒకప్పుడు అడవుల్లో కిన్నెర వాయించుకునే తనను గుర్తించి, ప్రపంచానికి పరిచయం చేసింది నాటి ముఖ్యమంత్రి కేసీఆరే అని మొగులయ్య గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ అందించిన ప్రోత్సాహం వల్లే తనకు పద్మశ్రీ పురస్కారం దక్కిందని, ఆయన చేసిన మేలును ఎప్పటికీ మరువలేనని కృతజ్ఞతలు తెలిపారు.

## పంజాబ్ వరద బాధితులకు బండి పరామర్శ

**భారత్-పాక్ సరిహద్దుల్లో పర్యటన**

**భారీ వరదలకు నీట మునిగిన 2 వేల గ్రామాలు**



చండీగఢ్: పంజాబ్ రాష్ట్రంలో వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటించారు. పాకిస్థాన్ సరిహద్దుల్లోని గురుదాస్‌పూర్ జిల్లా నంగ్లీతో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పంజాబ్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా 2 వేలకు పైగా గ్రామాలు నీట మునిగాయి. దాదాపు నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు నష్టపోయారు. బీఎస్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరదల వలన తీవ్రంగా నష్టపోయిన గురుదాస్‌పూర్ జిల్లాలో పర్యటించిన అనంతరం బండి సంజయ్ ఈ విషయమై 'ఎక్స్' వేదికగా స్పందించారు. నాంగ్లీతో పాటు సమీపంలోని సరిహద్దు గ్రామాల ప్రజలను కలుసుకుని, రైతులను పరామర్శించినట్లు తెలిపారు. "కేంద్ర ప్రభుత్వం నుంచి మీరు వచ్చారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎవరూ మమ్మల్ని పరామర్శించడానికి రాలేదు" అని స్థానిక రైతులు తనతో మొరపెట్టుకున్నారని బండి సంజయ్ వెల్లడించారు. అక్కడి రైతుల ఆవేదనలో నిజం ఉందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో పరిస్థితిని పరిశీలించామని, విధి నిర్వహణ బాధ్యతాయుతమైనది అని పేర్కొన్నారు. ప్రకృతి కోపం గురుదాస్‌పూర్‌ను దెబ్బతీసిందని బండి సంజయ్ పేర్కొన్నారు. వరదల కారణంగా ఇళ్లు దాదాపు 20 అడుగుల లోతు మునిగాయని, వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యారని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ వరదల వలన పాకిస్థాన్ పోస్టులు ధ్వంసమయ్యాయని, కానీ మన సైన్యం వరద బాధితులకు రక్షణగా నిలిచిందని కొనియాడారు. పంజాబ్ ప్రజలను కేంద్రం ఆదుకుంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. మోదీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, తాను భరోసా ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చానని బండి సంజయ్ అన్నారు. ఒక నెల రేషన్ బియ్యం, పప్పు, నూనె, మసాలా దినుసులతో కూడిన మోదీ రేషన్ కిట్‌లను కేంద్ర సహాయ మంత్రి బాధితులకు అందజేశారు. ఇది కేవలం సామగ్రి కాదని, నరేంద్ర మోదీ సందేశాన్ని ఇలా తీసుకు వచ్చానని పేర్కొన్నారు. "నేను పంజాబ్ ప్రజలను మరిచిపోలేదు" అని మోదీ ఇచ్చిన సందేశం ఇలా అందించానని అన్నారు. ఇక్కడకు తాను మంత్రిగా రాలేదని, సోదరుడిగా వచ్చానని బాధితులతో బండి సంజయ్ అన్నారు. పంజాబ్ రైతుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## సోషల్ వాణి



మనం చనిపోయిన తర్వాత దహన సంస్కారం చేస్తే శవం పూర్తిగా కాలిపోతుంది. ఎముకలు పూర్తిగా కాలిపోతాయి. కానీ నోటిలోని పళ్లు మాత్రం కాలిపోవు. శవాన్ని కాల్చడానికి బదులుగా భూమిలో పాతిపెడితే శరీరం మొత్తం మట్టిలో కలిసి పోతుంది. 20 సంవత్సరాల తర్వాత ఆ మట్టి భాగాన్ని తవ్వి తీస్తే పళ్లు మాత్రం చెక్కు చెదరకుండా ఉంటాయి. ఇంత గట్టిగా మన పళ్లు తయారు చేయబడ్డాయి. ఏ పళ్లనైతే అగ్ని కాల్చలేక పోయిందో, ఏ పళ్లనైతే మట్టి తనలో కరిగించుకోలేక పోయిందో, అవే పళ్లను 20 రోజుల పాటు ఏదైనా ఒక కూల్‌డ్రింక్‌లో ఉంచి పరిశీలిస్తే అవి పూర్తిగా కరిగిపోతున్నాయి. ఆ పళ్లు రంగుమారి నొక్కితే పిండిగా అయిపోతున్నాయి. ఒక కూల్‌డ్రింకులో ఒక పన్ను వేసి 8వ రోజు చూసేసరికి ఆ పన్ను పూర్తిగా కరిగిపోయి మాయమైంది. మనం పుట్టిన దగ్గర నుంచి చనిపోయే లోపులో 50 టన్నుల ఆహారాన్నయినా ఈ పళ్లతో నములుతాం. అన్ని టన్నుల ఆహారాన్ని నమిలినా అరగని పళ్లు మాత్రం ఒక కూల్‌డ్రింక్ నెల తిరగకుండా కరిగించేస్తున్నదంటే అవి తాగే డ్రింకులా లేక విషపదార్థాలా? విషపదార్థాలే, కాకపోతే ఎక్కువగా నీటి శాతం ఉండబట్టి మెల్లగా చంపే విషంలా పనిచేస్తాయి. అలాంటి గట్టి పళ్లనే నాశనం చేసే డ్రింక్స్‌కి మన లోపలి పేగులు, నరాలు, కణాలు ఒక లెక్కా ఏమిటి? అందుకే నో కూల్ డ్రింక్స్.. యూజ్ ఫ్రూట్ జ్యూసెస్.. టేక్ కేర్!

- రోజా లక్ష్మి



# ఎంతో చేశా.. కానీ నోబెల్ రాలే!

## పాక్-అఫ్ఘన్ వివాద పరిష్కారం నాకో లెక్కా?.. ఇప్పటికే ఎనిమిది యుద్ధాలు ఆపేశా: ట్రంప్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటికే ఎనిమిది యుద్ధాలను పరిష్కరించానని, ఇప్పుడు పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడమే తన తదుపరి లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఆ వివాదాన్ని పరిష్కరించడం తనకు చాలా సులువైన పని అని ఆయన అభివర్ణించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. “పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణ జరుగుతున్న విషయం నాకు తెలుసు. నేను తలచుకుంటే ఆ సమస్యను పరిష్కరించడం చాలా తేలిక. ఇది నా తొమ్మిదో లక్ష్యం అవుతుంది. ప్రస్తుతానికి నేను అమెరికాను నడపాలి, కానీ యుద్ధాలను పరిష్కరించడం నాకిష్టం” అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా, అణుశక్తి దేశాలైన భారత్-పాకిస్థాన్ మధ్య శాంతిని నెలకొల్పింది తానేనని ట్రంప్ మరోసారి తన పాత వాదనను వినిపించారు. అయితే, ఆయన వాదనను గతంలోనే భారత ప్రభుత్వం గట్టిగా ఖండించింది. ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. ఇంత చేసినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. “నేను ఎనిమిది యుద్ధాలు ఆపాను. రువాండా, కాంగో, భారత్-పాకిస్థాన్ వంటి ఎన్నో వివాదాలు పరిష్కరించాను. ప్రతీసారి, ‘ఈ యుద్ధం ఆపితే మీకు నోబెల్ బహుమతి వస్తుంది’ అని అనేవారు. కానీ నాకు రాలేదు. ప్రాణాలు కాపాడటం తప్ప నాకు వేరే విషయాలపై ఆసక్తి లేదు” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తనకంటే ముందున్న ఏ అధ్యక్షుడు ఒక్క యుద్ధాన్ని కూడా ఆపలేదని, తాను మాత్రం కోట్లాది మంది ప్రాణాలను కాపాడానని ఆయన పేర్కొన్నారు.

# గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

చండీగఢ్: పంజాబ్‌లో ప్రయాణికులతో వెళుతున్న గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం సంభవించినా, సిబ్బంది అప్రమత్తతతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన సిర్హింద్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే... అమృత్‌సర్ నుంచి సహర్సా వెళుతున్న గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు అంబాలాకు అర కిలోమీటరు దూరంలో ఉండగా, ఒక బోగీ నుంచి దట్టమైన పొగలు రావడాన్ని సిబ్బంది, ప్రయాణికులు గమనించారు. దీంతో వెంటనే అప్రమత్తమైన లోకో పైలట్ రైలును నిలిపివేశారు. ప్రయాణికులు భయాందోళనతో కిందికి దిగి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రయాణికులను సకాలంలో రైలు నుంచి దించివేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సిర్హింద్ జీఆర్‌పీ ఎస్‌హెచ్‌ఓ రతన్ లాల్ తెలిపారు. అయితే, ఈ ప్రమాదంలో మూడు కోచ్‌లు మంటల్లో కాలిపోయినట్లు ఆయన వివరించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ సంఘటనతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు పంపించారు.

# భారత్‌కు తొత్తుగా అఫ్ఘన్

## కాబూల్ ప్రభుత్వంతో సంబంధాలు తెంచుకుంటున్నాం.. పాక్‌లో నివసిస్తున్న అఫ్ఘన్లు వెంటనే దేశం విడిచి వెళ్లాలి

### పాకిస్థాన్ సర్కారు ఆదేశాలు



ఇస్లామాబాద్: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఆఫ్ఘనిస్థాన్‌తో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించబోమని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన ప్రకటన చేశారు. కాబూల్ ప్రభుత్వం.. భారత్, తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాద సంస్థతో కలిసి తమ దేశంపై కుట్ర పన్నుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్‌లో నివసిస్తున్న ఆఫ్ఘన్లందరూ తక్షణమే తమ స్వదేశానికి తిరిగి వెళ్లాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఖవాజా ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ... “ఒకప్పుడు మా ఆశ్రయంలో తలదాచుకున్న కాబూల్ పాలకులు, ఇప్పుడు భారత్ ఒడిలో కూర్చుని మాపై కుట్ర చేస్తున్నారు. ఇకపై శాంతి చర్చలు, విజ్ఞప్తులు ఉండవు. ఉగ్రవాదం ఎక్కడి నుంచి పుట్టుకొచ్చినా, వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది” అని హెచ్చరించారు. ఇటీవల తాలిబన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ భారత్‌లో ఆరు రోజుల పాటు పర్యటించిన నేపథ్యంలో పాక్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య 48 గంటల కాల్పుల విరమణ ముగిసిన వెంటనే పాక్ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరు దేశాల ప్రతినిధులు ఖతార్‌లోని దోహాలో సమావేశం కానున్న నేపథ్యంలో కాల్పుల విరమణను పొడిగించినట్లు తెలుస్తోంది. గతవారం సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో ఇరువైపులా పదుల సంఖ్యలో సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం నాడు పాకిస్థాన్ తమ భూభాగంపై వైమానిక దాడులు చేసిందని, ఈ ఘటనలో ముగ్గురు క్రికెటర్లు సహా 8 మంది మరణించారని ఆఫ్ఘనిస్థాన్ ఆరోపించింది. ఈ దాడికి నిరసనగా, పాకిస్థాన్‌తో జరగాల్సిన త్రైపాక్షిక టీ20 సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్లు ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. అయితే, ఆఫ్ఘన్ సరిహద్దుల్లోని టీటీపీ అనుబంధ సంస్థ అయిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని కచ్చితత్వంతో కూడిన వైమానిక దాడులు చేశామని పాక్ అంగీకరించింది. నార్త్ వజిరిస్థాన్‌లో ఏడుగురు పాక్ సైనికుల మృతికి కారణమైన ఆత్మాహుతి దాడిలో ఈ గ్రూప్ హస్తం ఉందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. ఐదేళ్లుగా తాము ఎన్నో ప్రయత్నాలు చేసినా కాబూల్ నుంచి సానుకూల స్పందన రాలేదని, ఆఫ్ఘన్ ప్రభుత్వానికి 836 నిరసన లేఖలు, 13 విజ్ఞప్తులు పంపామని పాక్ రక్షణ మంత్రి తెలిపారు.



# చోక్సీని భారత్‌కు అప్పగించండి

### బెల్జియం కోర్టు కీలక తీర్పు

లండన్: వేల కోట్ల రూపాయల బ్యాంకు కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి మేహుల్ చోక్సీ అప్పగింత విషయంలో భారత ప్రభుత్వానికి ఊరట లభించింది. చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు బెల్జియంలోని ఆంట్వెర్ప్ కోర్టు శుక్రవారం ఆమోదించింది. భారత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు చోక్సీని అరెస్టు చేయడం చట్టబద్ధమేనని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. గత ఏప్రిల్ 11న అరెస్టయిన 66 ఏళ్ల చోక్సీ, అప్పటి నుంచి నాలుగు నెలలుగా బెల్జియం జైలులోనే ఉన్నారు. ఆయన దాఖలు చేసిన పలు బెయిల్ పిటిషన్లను కోర్టులు తిరస్కరించాయి. అయితే, తాజా తీర్పును సవాలు చేస్తూ 15 రోజుల్లోగా బెల్జియం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు చోక్సీకి అవకాశం ఉంది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ. 13,000 కోట్ల బ్యాంకు మోసానికి పాల్పడినట్టు చోక్సీపై ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, సాక్ష్యాల ధ్వంసం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టం కింద భారత్ ఆయనపై కేసులు నమోదు చేసింది. ఈ కేసులో సాక్ష్యాధారాలు సమర్పించేందుకు సీబీఐ అధికారులు మూడుసార్లు బెల్జియంను సందర్శించారు. అంతర్జాతీయ ఒప్పందాలను కూడా తమ వాదనలకు బలంగా వినియోగించారు. చోక్సీని అప్పగించిన తర్వాత ఆయన భద్రత, జైలు సౌకర్యాలపై బెల్జియం అధికారులకు భారత్ స్పష్టమైన హామీ ఇచ్చింది. ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలులోని 12వ నంబర్ బ్యారక్‌లో యూరోపియన్ ప్రమాణాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపింది. పరిశుభ్రమైన తాగునీరు, ఆహారం, టీవీ, వార్తాపత్రికలతో పాటు ప్రైవేట్ వైద్యుడి సేవలను కూడా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చింది. ఆయనను ఏకాంత నిర్బంధంలో ఉంచబోమని, చదరంగం, క్యారమ్స్, బ్యాడ్మింటన్ ఆడుకునేందుకు వీలు కల్పిస్తామని వివరించింది. తాను ఆంటిగ్వా పౌరుడినని, భారత పౌరసత్వాన్ని వదులుకున్నానని చోక్సీ వాదిస్తున్నప్పటికీ, ఆయన ఇప్పటికీ భారత పౌరుడేనని భారత్ వాదిస్తోంది. చోక్సీ దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉందని కోర్టు అంగీకరించడం గమనార్హం.

### సంపాదన ఉండగా

# భరణం ఎందుకు?

### విడాకుల కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

### రైల్వే ఉన్నతాధికారిణి అభ్యర్థన తిరస్కరణ




న్యూఢిల్లీ: విడాకుల కేసుల్లో శాశ్వత భరణం చెల్లింపుపై ఢిల్లీ హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా స్వతంత్రంగా, నిలదొక్కుకున్న భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. భరణం అనేది సామాజిక న్యాయంలో ఒక భాగమే తప్ప, దాన్ని సంపద పెంచుకోవడానికి లేదా ఇద్దరి మధ్య ఆర్థిక సమానత్వం తీసుకురావడానికి ఒక సాధనంగా ఉపయోగించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, న్యాయవాదిగా పనిచేస్తున్న భర్త, గ్రూప్-ఎ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) అధికారిణిగా పనిచేస్తున్న భార్య 2010 జనవరిలో వివాహం చేసుకున్నారు. అయితే, పెళ్లయిన 14 నెలలకే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. తన భార్య తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తోందని, అవమానకరమైన భాష వాడుతోందని ఆరోపిస్తూ భర్త ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఆరోపణలను భార్య ఖండించారు. విచారణ జరిపిన ఫ్యామిలీ కోర్టు, భర్త వాదనలతో ఏకీభవిస్తూ క్రూరత్వం కింద విడాకులు మంజూరు చేసింది. అయితే, భార్య కోరిన శాశ్వత భరణం అభ్యర్థనను తిరస్కరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సదరు మహిళా అధికారిణి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విడాకులకు అంగీకరించాలంటే తనకు రూ. 50 లక్షలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేసినట్లు ఫ్యామిలీ కోర్టు గుర్తించిందని, ఈ విషయాన్ని ఆమె తన అఫిడవిట్‌లో, క్రాస్ ఎగ్జామినేషన్‌లో స్వయంగా అంగీకరించారని హైకోర్టు గుర్తు చేసింది. దీనిబట్టి ఆమె వైఖరిలో స్పష్టమైన ఆర్థిక కోణం కనిపిస్తోందని అభిప్రాయపడింది. భార్య ప్రభుత్వ ఉన్నతాధికారిణిగా మంచి జీతం సంపాదిస్తూ ఆర్థికంగా బలంగా ఉన్నారని, కాబట్టి ఆమెకు భరణం అవసరం లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. “నిజంగా ఆర్థిక సహాయం అవసరమైన వారు మాత్రమే భరణం కోరాలి. ఈ కేసులో అప్పీలుదారు (భార్య) ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. వారిద్దరూ కలిసి ఉన్నది కొద్ది కాలమే, వారికి పిల్లలు లేరు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదు” అని పేర్కొంటూ ఆమె పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

# యుద్ధం ఆపండి.. ఇద్దరూ విజయులే

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్

వాషింగ్టన్: యుద్ధాన్ని తక్షణమే ఆపేసి, ఇరు దేశాలూ విజయం ప్రకటించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త సూచన చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడిన మరుసటి రోజే, వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాత ట్రంప్ తన అభిప్రాయాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. జెలెన్‌స్కీతో సమావేశం చాలా ఆసక్తికరంగా, స్నేహపూర్వకంగా జరిగిందని ట్రంప్ తెలిపారు. “హత్యలు ఆపి, ఒక ఒప్పందానికి రావాల్సిన సమయం ఆసన్నమైందని నేను జెలెన్‌స్కీకి చెప్పాను. ఇదే విషయాన్ని పుతిన్‌కు కూడా గట్టిగా సూచించాను” అని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాలూ ఉన్నచోటే ఆగిపోవాలని, ఇద్దరూ విజయం సాధించినట్టు ప్రకటించుకోవాలని ట్రంప్ సలహా ఇచ్చారు. “చరిత్రే దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఇకపై కాల్పులు, మరణాలు, అనవసరమైన భారీ ఖర్చులు వద్దు. నేను అప్పుడే అధ్యక్షుడిగా వుండి ఉంటే ఈ యుద్ధం మొదలయ్యేదే కాదు” అని ఆయన అన్నారు. అయితే, ఈ సమావేశంలో టోమాహాక్ క్షిపణుల అంశంపై ఇరువురి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఉక్రెయిన్‌కు టోమాహాక్‌లు అవసరం లేని పరిస్థితి రావాలని తాను కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారు. “ఆ క్షిపణులు అమెరికా భద్రతకు అవసరం” అని ఆయన స్పష్టం చేశారు. కానీ, జెలెన్‌స్కీ మాత్రం తమకు సుమారు 2,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల టోమాహాక్‌లు కచ్చితంగా కావాలని గట్టిగా కోరారు. పుతిన్ యుద్ధాన్ని ముగించాలని కోరుకుంటున్నారని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేయగా, జెలెన్‌స్కీ మాత్రం అందుకు విరుద్ధంగా మాట్లాడారు. పుతిన్‌కు ఆ ఉద్దేశం లేదని ఆయన అన్నారు. కాగా, గురువారం పుతిన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలో గొప్ప పురోగతి సాధించామని ట్రంప్ వెల్లడించారు. త్వరలో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో పుతిన్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఈ భేటీకి మార్గం సుగమం చేసేందుకు విదేశాంగ మంత్రి మార్కో రూబియో నేతృత్వంలోని బృందం మరోవైపు ఉక్రెయిన్‌కు మద్దతు అందించడంలో ట్రంప్ విఫలమయ్యారని హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ సభ్యుడు గ్రెగొరీ మీక్స్ విమర్శించారు.

# స్టాక్ మార్కెట్‌కు దీపావళి సెలవులు

### 21, 22 తేదీల్లో ఎన్ఎస్ఈ, బీఎస్ఈ బంద్

### 21న గంటపాటు ప్రత్యేక మూరత్ ట్రేడింగ్

ముంబై: దీపావళి పండుగ సందర్భంగా దేశీయ స్టాక్ మార్కెట్లకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 21, 22 తేదీల్లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) పనిచేయవని మార్కెట్ వర్గాలు తెలిపాయి. అయితే, లక్ష్మీ పూజను పురస్కరించుకుని అక్టోబర్ 21న గంటపాటు ప్రత్యేకంగా ‘మూరత్ ట్రేడింగ్’ సెషన్‌ను నిర్వహించనున్నారు. ఇన్వెస్టర్లు, ట్రేడర్లు అత్యంత పవిత్రంగా భావించే ఈ సెషన్, ఈసారి సంప్రదాయానికి భిన్నంగా మధ్యాహ్నం జరగనుండటం విశేషం. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 21 దీపావళి లక్ష్మీ పూజ కారణంగా మార్కెట్లకు పూర్తి రోజు సెలవు ప్రకటించారు. కానీ, అదే రోజు మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:45 గంటల వరకు ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ జరుగుతుంది. ఈ సమయంలో ఈక్విటీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్%ఉ%ఓ), కరెన్సీ, కమోడిటీ డెరివేటివ్స్ వంటి వివిధ సెగ్మెంట్లలో ట్రేడింగ్ చేసుకోవచ్చు. ట్రేడ్ మాడిఫికేషన్ల కోసం 2:55 వరకు సమయం ఉంటుంది. ఆ తర్వాత అక్టోబర్ 22 బలిప్రతిపద సందర్భంగా మార్కెట్లకు పూర్తిగా సెలవు ఉంటుంది. అంతకుముందు అక్టోబర్ 18న ధనత్రయోదశి, 19న ఆదివారం కావడంతో మార్కెట్లు మూతపడ్డాయి. అక్టోబర్ 20న మాత్రం యథావిధిగా ట్రేడింగ్ కొనసాగుతుంది. హిందూ క్యాలెండర్ ప్రకారం కొత్త ఆర్థిక సంవత్సరం ‘సంవత్ 2082’కు స్వాగతం పలుకుతూ దశాబ్దాలుగా ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నారు. ఇది లాభనష్టాలకు అతీతంగా, రాబోయే సంవత్సరంలో సంపద, శ్రేయస్సు కలగాలని కోరుకుంటూ చేసే ఒక శుభారంభంగా ట్రేడర్లు భావిస్తారు. ఈ రోజున బ్రోకర్లు, వారి కుటుంబ సభ్యులు, ఇన్వెస్టర్లు ఉత్సాహంగా పాల్గొని చిన్న మొత్తంలో షేర్లను కొనుగోలు చేసి కొత్త ఖాతా తెరుస్తారు. సాధారణంగా ఈ సెషన్‌లో ట్రేడింగ్ వాల్యూమ్ తక్కువగా ఉన్నప్పటికీ, సెంటిమెంట్ బలంగా ఉండటంతో మార్కెట్లు సానుకూలంగా స్పందిస్తాయి. చారిత్రకంగా చూస్తే, గత 18 మూరత్ సెషన్లలో సెన్సెక్స్ 14 సార్లు లాభాలతో ముగిసింది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లోనూ ఈ సెషన్‌లో సెన్సెక్స్ 5.86% పెరగడం విశేషం. గతేడాది 2024లో కూడా 335 పాయింట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈసారి సాయంత్రం వేళ కాకుండా మధ్యాహ్నం నిర్వహిస్తుండటం ఒక ముఖ్యమైన మార్పు. తిథుల విషయంలో కొంత సందిగ్ధత ఉన్నప్పటికీ, చాలా కుటుంబాలు అక్టోబర్ 20 సాయంత్రం లక్ష్మీ పూజ చేసుకున్నా, దలాల్ స్ట్రీట్‌లో మాత్రం 21వ తేదీనే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం దీపావళి సెలవుల తర్వాత మార్కెట్లకు మరో రెండు సెలవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. నవంబర్ 5న గురునానక్ జయంతి, డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా మార్కెట్లు మూతపడనున్నాయి. ఇన్వెస్టర్లు ఈ మార్పులను గమనించి తమ పెట్టుబడి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పీకే పార్టీ చర్చ అనవసరం: షా

పాట్నా/న్యూఢిల్లీ: ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ గురించి ఎన్నికల ఫలితాల అనంతరం మాట్లాడుకుందామని కేంద్ర మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, బీహార్‌లో ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుందని, వారి కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారో, ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారో వారికే తెలియదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బీహార్‌లో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కిడ్నాప్‌లు, కుల ఘర్షణలకు తెరపడిందని అమిత్ షా అన్నారు. గత పాలనలో బీహార్‌లో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, గత ఇరవై ఏళ్ల కాలంలో దానిని పూడ్చామని తెలిపారు. ఇప్పుడు బలమైన పునాదులపై నిర్మాణాలు చేపడతామని ఆయన అన్నారు. కొత్త ముసుగు ధరించి ఆటవిక రాజ్యాన్ని తిరిగి తీసుకురావాలని ఆశిస్తున్న వారిని ఓటర్లు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బీహార్‌లో పరిశ్రమలకు సరిపడే భూములు లేకపోవచ్చని, కానీ నాణ్యమైన శ్రామిక శక్తి ఉందని అన్నారు. రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

# పాక్ ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే: రాజ్‌నాథ్ సింగ్

లక్నో: పాకిస్థాన్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ క్షిపణి పరిధిలోనే ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని ఆయన హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అక్కడ తొలి విడత బ్రహ్మోస్ క్షిపణులు ఉత్పత్తి పూర్తయింది. వాటిని కేంద్ర ప్రభుత్వం సైన్యానికి అప్పగించింది. ఉత్తర ప్రదేశ్ రక్షణ పరిశ్రమ కారిడార్‌కు ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ వద్ద ఉన్న అత్యాధునిక క్షిపణి సామర్థ్యాల నుంచి పాకిస్థాన్ తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగడితే ఊహించని రీతిలో ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇండియాకు మేం దగ్గరైతే పాక్ ఓర్వదు: ఆఫ్ఘన్ మాజీ ఎంపీ

కాబూల్: “మీరు పెంచి పోషిస్తున్న ఉగ్రవాదం ఏదో ఒకరోజు మిమ్మల్నే కాటేస్తుంది.. ఉగ్రవాదాన్ని ఆయుధంగా మార్చుకుని మాపై గురి పెట్టారు. భవిష్యత్తులో మీరు చింతించాల్సిన రోజు వస్తుంది” అంటూ ఆఫ్ఘనిస్థాన్ మాజీ ఎంపీ మరియం సొలైమాంఖిల్ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ను హెచ్చరించారు. ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పాక్ జరిపిన వైమానిక దాడిలో ముగ్గురు దేశవాళీ క్రికెటర్లు సహా మొత్తం ఎనిమిది మంది దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనపై మరియం స్పందిస్తూ.. పాక్ దాడిలో చిన్న పిల్లలు, మహిళలు చనిపోవడం తన హృదయాన్ని ముక్కలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ కు దగ్గరయ్యేందుకు ఆఫ్ఘనిస్థాన్ ప్రయత్నించిన ప్రతిసారీ పాకిస్థాన్ ఇలాగే దాడులు చేస్తోందని మరియం ఆరోపించారు. భారతీయులు, ఆఫ్ఘన్ల మధ్య శాంతి నెలకొనడం చూసి పాక్ ఓర్వలేదని ఆమె మండిపడ్డారు. ఆఫ్ఘన్ లోని ఉగ్రవాద క్యాంపులపై దాడులు చేస్తున్నామని చెబుతూ సామాన్యులపై బాంబులు వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో ఒక్క ఉగ్రవాది మరణించినట్లు పాక్ చూపించలేకపోయిందని ఆమె ఆరోపించారు. పాక్ జరిపిన అమానుష దాడుల్లో ఎంతోమంది ఆఫ్ఘన్ పౌరులు, చిన్న పిల్లలు మరణించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారిన విషయాన్ని మరియం గుర్తు చేశారు.

# భవిష్యత్తులో అన్నీ బయోమెట్రిక్ చెల్లింపులే

### గాలి పీల్చినంత సహజంగా చెల్లింపుల ప్రక్రియ

### మాస్టర్ కార్డు సీఈవో కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మనం ఇప్పుడు పర్సులో పెట్టుకుని తిరుగుతున్న డెబిట్, క్రెడిట్ కార్డులు భవిష్యత్తులో కనిపించకుండా పోయే రోజులు ఎంతో దూరంలో లేవు. చెల్లింపుల ప్రపంచం పూర్తిగా డిజిటల్‌గా మారిపోనుంది. ఈ కీలక విషయాన్ని ‘మాస్టర్‌కార్డ్’ సౌత్ ఆసియా సీఈఓ గౌతమ్ అగర్వాల్ వెల్లడించారు. ‘ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025’లో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ చెల్లింపుల వ్యవస్థ స్వరూపాన్ని వివరించారు. భవిష్యత్తులో కార్డులు ప్రస్తుతం ఉన్న ప్లాస్టిక్ రూపంలో ఉండవని ఆయన స్పష్టం చేశారు. “మన కార్డులను ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, చివరికి ఉంగరాల్లోకి కూడా డిజిటల్‌గా మార్చుకోవచ్చు. భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియ అనేది మనం ప్రత్యేకంగా చేసే పనిలా కాకుండా, గాలి పీల్చినంత సహజంగా, మనకు తెలియకుండానే జరిగిపోతుంది” అని ఆయన వివరించారు. ఈ మార్పుకు ఎంతో కాలం పట్టదని ఆయన అభిప్రాయపడ్డారు. చెల్లింపుల వ్యవస్థలో మరో కీలక మార్పు రానుందని అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం ప్రతీ ఆన్‌లైన్ లావాదేవీకి వస్తున్న ఓటీపీల అవసరం భవిష్యత్తులో ఉండదన్నారు. “లావాదేవీల్లో భద్రత, సౌకర్యం చాలా ముఖ్యం. ఓటీపీల స్థానంలో బయోమెట్రిక్ విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. దీనివల్ల లావాదేవీలు మరింత సురక్షితంగా, వేగంగా పూర్తవుతాయి” అని ఆయన పేర్కొన్నారు. భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై గౌతమ్ అగర్వాల్ ప్రశంసలు కురిపించారు. “ప్రపంచంలోనే అత్యంత ఆధునిక చెల్లింపుల వ్యవస్థ భారత్‌లోనే ఉంది. ఇక్కడి ఆవిష్కర్తలు, ప్రగతిశీల నియంత్రణ సంస్థ, అందరి సహకార మనోభావమే ఇందుకు కారణం” అని కొనియాడారు.

# జీతం రాలేదని ఉద్యోగి సూసైడ్

### పంచాయతీ కార్యాలయం ముందు వాటర్‌మ్యాన్ ఆత్మహత్య

### 27 నెలలుగా జీతం రాకపోవడమే కారణమని ఆరోపణ

బెంగళూరు: 27 నెలలుగా జీతం రావడం లేదన్న మనస్తాపంతో ఓ వాటర్‌మ్యాన్ తాను పనిచేస్తున్న పంచాయతీ కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకున్నాడు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హొంగనూరు గ్రామ పంచాయతీలో 2016 నుంచి వాటర్‌మ్యాన్‌గా పనిచేస్తున్న చికూస నాయక అనే వ్యక్తి, తనకు రావాల్సిన జీతాల కోసం ఏళ్లుగా పోరాడుతున్నాడు. తన ఆవేదనను వివరిస్తూ రాసిన సూసైడ్ నోట్‌లో పలు కీలక విషయాలను వెల్లడించాడు. “నాకు 27 నెలలుగా జీతం రాలేదు. ఈ విషయంపై పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ), గ్రామ పంచాయతీ అధ్యక్షురాలికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. చివరికి జిల్లా పంచాయతీ సీఈఓను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేగాక పీడీఓ రామే గౌడ, పంచాయతీ అధ్యక్షురాలి భర్త మోహన్ కుమార్ తనను మానసికంగా తీవ్రంగా వేధించారని చికూస నాయక ఆరోపించాడు. “సెలవు అడిగితే నా స్థానంలో వేరే వ్యక్తిని చూసుకుని వెళ్లమనేవారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆఫీసులోనే ఉండమని బలవంతం చేసేవారు. వారి వేధింపుల వల్లే నేను చనిపోతున్నాను. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి” అని సూసైడ్ నోట్‌లో కోరాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


# మొజాంబిక్‌లో బోటు బోల్తా.. ముగ్గురు భారతీయుల మృతి

మొజాంబిక్‌లోని బీరా పోర్టు తీరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారతీయులతో ప్రయాణిస్తున్న ఒక బోటు బోల్తా పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఈ దురదృష్టకర సంఘటనను మొజాంబిక్‌లోని భారత హైకమిషన్ అధికారికంగా ధ్రువీకరించింది. సముద్రంలో లంగరు వేసి ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌లోకి సిబ్బందిని తరలించేందుకు 14 మంది భారతీయులతో ఒక బోటు బయలుదేరింది. శుక్రవారం బీరా పోర్టు సమీపంలో ఈ సిబ్బంది బదిలీ ప్రక్రియ జరుగుతుండగా, అనుకోని రీతిలో బోటు నీటిలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

వయ్యారి చిత్రం



హెబ్బా పటేల్





## నా కోడళ్లు బంగారం: అమల

అక్కినేని వారి ఇంట ఇటీవల కాలంలో రెండు పెళ్లిళ్లు జరిగాయి. నాగార్జున ఇద్దరు కుమారులు నాగచైతన్య, అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2024లో హీరోయిన్ శోభిత దూళిపాళను చైతన్య వివాహం చేసుకోగా... ఈ ఏడాదే ముంబైకి చెందిన వ్యాపారవేత్త జైనబ్ రిబ్జీను అఖిల్ పెళ్లాడారు. దీంతో కొత్త కోడళ్ల రాకతో అక్కినేని వారి ఇళ్లు కళకళలాడుతోంది. అయితే మామూలుగా అందరి ఇళ్లలో అత్తా- కోడళ్లు ఎలా ఉంటారో అందరీ తెలుసు. కానీ, సెలబ్రిటీల ఇళ్లలో ఎలా ఉంటారు? ఆ రిలేషన్ ఎలా మెయింటేన్ చేస్తారో తెలుసుకోవాలని చాలా మందికి ఉంటుంది. సెలబ్రిటీల ఇంట్లో అత్తా- కోడళ్ల మధ్య బాండింగ్, వాళ్లు అనుసరించే విధానాలు తెలుసుకోవాలని అనుకుంటారు. ఈ క్రమంలోనే కోడళ్లతో తన అనుబంధం గురించి నాగ్ సతీమణి అమల రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన కోడళ్ల గురించి గొప్పగా చెప్పారు. ఆమె కోడళ్లు బంగారం అని అన్నారు. తమ ఇంటికి శోభిత, జైనబ్ రావడంతో తనకు గర్ల్ సర్కిల్ ఏర్పడిందని అమల అన్నారు. వాళ్ల వ్యక్తిగత విషయాల్లో తలదూర్చనని చెప్పారు.



## 23న ఓటీటీలోకి ఓజీ

పవన్ కళ్యాణ్ హీరోగా సాహెూ సజీత్ దర్శకత్వంలో వచ్చిన 'ఓజీ' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించిన విషయం తెల్సిందే. పవన్ కెరీర్‌లోనే టాప్ ఓపెనింగ్స్‌ను దక్కించుకున్న ఓజీ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు దసరా కానుకగా వచ్చిన ఓజీ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. ఓజీ సినిమాను ఓటీటీలో స్ట్రీమింగ్ చేయడం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో సినిమాలు థియేట్రికల్ రిలీజ్ అయిన తర్వాత నాలుగు వారాలకు ఓటీటీలో స్ట్రీమింగ్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు ఓజీ సినిమా సైతం దాదాపు నాలుగు వారాల గ్యాప్ తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అయింది. థియేట్రికల్ రన్ పూర్తి కావడంతో ఓటీటీ స్ట్రీమింగ్ అధికారిక ప్రకటన వచ్చింది. ఓజీ సినిమాను సైతం భారీ మొత్తానికి గాను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసిందట. అక్టోబర్ 23న ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది.



## డిసెంబర్ 25న థియేటర్లలో శంభాల

యంగ్ హీరో ఆది సాయికుమార్ ఓ సరికొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు సిద్ధమవుతున్నాడు. రొటీన్ కథలకు భిన్నంగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నంలో ఆయన చేస్తున్న శంబాల సినిమాపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే శంబాల చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్, ముఖ్యంగా టైటిల్ లోగో, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఏదో తెలియని రహస్యాన్ని ఛేదించే కథాంశంతో ఈ సినిమా రాబోతుందని అందరూ భావిస్తున్నారు. అసలు ఆ మిస్టరీ ఏంటి? దాని వెనుక ఉన్న ప్రపంచం ఎలా ఉండబోతోంది? అనే దానిపై ప్రేక్షకుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది. ఈ నేపథ్యంలోనే చిత్రయూనిట్ పండగ పూట ఫ్యాన్స్‌కు అదిరిపోయే ట్రీట్ ఇచ్చింది. దీపావళి సందర్భంగా, 'శంబాల' చిత్ర బృందం మోస్ట్ అవైటెడ్ అప్‌డేట్‌ను ప్రకటించింది. ఈ మిస్టికల్ థ్రిల్లర్‌ను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది.

## విశాల్ శరీరంపై 119 కుట్లు



హీరో విశాల్ గురించి ప్రత్యేక పరిచయం చేయనక్కర్లేదు. తమిళ హీరో అయినప్పటికీ ఆయనకు తెలుగులో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది. ఎన్నో తెలుగు, తమిళ సినిమాల్లో నటించి స్టార్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న విశాల్ కు యాక్షన్ హీరో అనే పేరు కూడా ఉంది. యాక్షన్ సీన్స్ లో ఆయన పెర్ఫార్మెన్స్ వేరే లెవెల్ అని అందరూ అంటూంటారు. దానిక్కారణం ఆయన ఎలాంటి డూప్స్ లేకుండా, అన్నీ స్వయంగా తానే చేయడం. ఎంతోమంది హీరోలు యాక్షన్ సీన్స్ కోసం డూప్ ను వాడుతుంటారు. చిన్న చిన్న ఫైట్స్ అయితే వాళ్లే మేనేజ్ చేస్తారు కానీ ఏదైనా పెద్ద సీక్వెన్స్, యాక్షన్ సీన్స్ చేయాలంటే మాత్రం రిస్క్ తీసుకోకుండా డూప్ ను పెట్టి ఆ సీన్స్ ను షూట్ చేస్తుంటారు. కానీ విశాల్ మాత్రం అలా కాదు. ఎంత పెద్ద యాక్షన్ సీక్వెన్స్ అయినా ఆయనే స్వయంగా చేస్తారు. ఎంత భారీ స్టంట్ అయినా ఆయనే నటిస్తారు. అందుకే అతని శరీరానికి ఏకంగా 119 కుట్లు పడ్డట్టు విశాల్ వెల్లడించారు. సినిమాల్లో ఎలాంటి డూప్స్ లేకుండా చేయడం వల్లే తనకు అన్ని కుట్లు పడ్డాయని అతను పేర్కొన్నారు.



## డీఎస్పీకి కీర్తి సురేష్ కలిసిరానుందా!

బలగం వేణు ఎల్లమ్మ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. తెలంగాణ పల్లెల్లో ఎల్లమ్మ తల్లి పట్నాలు, బోనాలు.. దాని చుట్టూ ప్రజల నమ్మకాలు.. ఇలా సున్నితాంశాలతో వేణు కథ రాసుకున్నాడట. ఐతే ఈ సినిమాలో హీరోయిన్ కీర్తి సురేష్ సెలెక్ట్ అయ్యింది. ముందు ఈ సినిమాలో సాయి పల్లవిని తీసుకోవాలని అనుకోగా ఆమె బిజీగా ఉండటం వల్ల కీర్తి సురేష్ ని లాక్ చేశారు. మహానటితో ప్రేక్షకుల మనసులు గెలిచిన కీర్తి సురేష్ ఆ తర్వాత ఆ రేంజ్ స్కోప్ ఉన్న రోల్ దక్కలేదని ఫీల్ అవుతోంది. అందుకే ఎల్లమ్మ కథ ఆమె దగ్గరకు వచ్చినట్టు అయ్యింది. ఫైనల్ గా ఎల్లమ్మ దేవి శ్రీ ప్రసాద్, కీర్తి సురేష్ కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే సినిమా అవుతుంది. డైరెక్టర్ వేణు ఈ సినిమాలో కొన్ని సీన్స్ చాలా ప్రత్యేకంగా ఇదివరకు ఎప్పుడు తెర మీద చూడని సన్నివేశాలు రాసుకున్నాడట. అందుకే టీం అంతా కూడా సినిమా మీద అంత నమ్మకంగా ఉన్నారు. ఇక.. దేవి సినిమాతో మ్యూజిక్ డైరెక్టర్ గా కెరీర్ మొదలు పెట్టిన దేవి శ్రీ ప్రసాద్ మళ్లీ ఎల్లమ్మ అంటే మరో దేవత సినిమాతో తెరంగేట్రం చేస్తున్నాడు. దాదాపు పాతికేళ్ల సంగీత దర్శకుడి ప్రయాణంలో ఎన్నోసార్లు తనకు హీరో ఆఫర్ వచ్చినా చేయని దేవి శ్రీ ప్రసాద్ ఎల్లమ్మ కోసం రెడీ అయ్యాడంటే అందరు షాక్ అవుతున్నారు.

## నేనూ తప్పులు చేశా: సమంత




సౌత్ స్టార్ హీరోయిన్ సమంత వివిధ రీజన్స్ తో ఈ మధ్య ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. మయోసైటిస్ కారణంగా సినిమాల నుంచి కాస్త బ్రేక్ తీసుకున్న సమంత, దాన్నుంచి కోలుకుని ఇప్పుడు మళ్లీ స్క్రీన్ పై సందడి చేయడానికి రెడీ అయ్యారు. కెరీర్లో బిజీ అయ్యేందుకు ప్రయత్నిస్తూ, అందులో భాగంగానే సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ తో బిజీ అవుతున్నారు. రీసెంట్ గా ఎన్డీ టీవీ వరల్డ్ సమ్మిట్ లో పాల్గొన్న సమంత ఆ కార్యక్రమంలో తన కెరీర్ తో పాటూ పర్సనల్ విషయాల గురించి కూడా ప్రస్తావించారు. తన లైఫ్ లో జరిగిన ప్రతీదీ ప్రజల సమక్షంలోనే జరిగిందని చెప్పిన సమంత, హెల్త్ విషయంలో ఎంతో ఇబ్బంది పడ్డానని, అయినప్పటికీ ఆ టైమ్ లో తనపై ఎన్నో విమర్శలొచ్చాయని, సోషల్ మీడియాలో అలా ఉండబట్టే ఇలా జరిగిందని తీర్పులు కూడా ఇచ్చేశారని, తన లైఫ్ లో జరిగే వాటికి తనక్కూడా ఆన్సర్ తెలియదని, కానీ వాటి గురించే మాట్లాడాల్సి వస్తుందని, తానేమీ పర్ఫెక్ట్ కాదని, తాను కూడా జీవితంలో తప్పులు చేసి ఉండొచ్చని, ఎదురుదెబ్బలు తిన్నానని, కానీ ఇప్పుడు బెటర్ అయ్యానని చెప్పింది.



## థామాపై రష్మిక ఆశలు

ఛావా సినిమా తర్వాత బాలీవుడ్‌లో మరో విజయం కోసం రష్మిక ఎదురు చూస్తోంది. థామాతో ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా కోసం రష్మిక మందన్న కాస్త ఎక్కువగానే కష్టపడిందని, అంతే కాకుండా ప్రమోషన్ కోసం రష్మిక కాళ్లకు చక్రాలు కట్టుకుని మరీ తిరుగుతోందట. ఈ సినిమా రష్మిక మందన్నకు అత్యంత కీలకంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఇటీవలే రష్మిక మందన్న వివాహ నిశ్చితార్థం జరిగిందనే వార్తలు వస్తున్నాయి. విజయ్ దేవరకొండతో ఆమె వివాహం కన్ఫర్మ్ అయిందని, పెళ్లికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. నిశ్చితార్థం విషయం ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల వారు కూడా అనధికారికంగా కన్ఫర్మ్ చేశారు. దాంతో రష్మిక నిశ్చితార్థం తర్వాత మొదటి సారి థామా సినిమాతో రాబోతుంది.





# రోకో రీ ఎంట్రీకి వరుణుడు అడ్డు!

**భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగబోయే 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆదివారం పెర్త్‌లోని స్టేడియంలో జరగనుంది. అయితే మ్యాచ్‌కు సరిగ్గా ఒక రోజు ముందు వాతావరణ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ పెరిగింది.**

**సుదీర్ఘ విరామం తర్వాత ఈ సిరీస్‌తోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్లోకి తిరిగి వస్తుండటంతో ఈ సిరీస్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కానీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయ్యే లేదా ఆలస్యమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. పెర్త్‌లో ఆదివారం జరగబోయే తొలి వన్డే మ్యాచ్‌పై వాతావరణ ప్రభావం ఉండే అవకాశం ఉంది.**

ఆక్యూవెదర్ నివేదిక ప్రకారం.. ఆదివారం పెర్త్‌లో 63 శాతం వర్షం కురిసే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా మ్యాచ్ జరిగే సమయంలో 36 శాతం వర్షం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కారణంగా మ్యాచ్‌లో పలుమార్లు అంతరాయాలు ఏర్పడవచ్చు. ఇది బ్యాటర్లకు కొంత ఇబ్బంది కలిగించే అవకాశం ఉంది. వర్షం కారణంగా టాస్ సమయంలో కూడా మార్పులు జరిగే అవకాశం ఉంది. సాధారణంగా భారత కాలమానం ప్రకారం ఉదయం 8.30 గంటలకు టాస్ జరగాల్సి ఉంది. అయితే వర్షం కారణంగా ఈ సమయం మారవచ్చు. పెర్త్ పిచ్ ప్రారంభంలో ఫాస్ట్ బౌలర్లకు మంచి స్వింగ్, బౌన్స్‌ను అందిస్తుంది. ఇది బ్యాటర్లను ఇబ్బంది పెడుతుంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకోవడానికి మొగ్గు చూపవచ్చు. పెర్త్‌లోని ఆప్టస్ స్టేడియంలో ఆస్ట్రేలియా జట్టుకు అద్భుతమైన రికార్డు ఉంది. కంగారూ జట్టు ఈ మైదానంలో ఇప్పటివరకు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఓడిపోలేదు. ఆస్ట్రేలియా ఇక్కడ ఆడిన మూడు వన్డే మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది.భారత జట్టు ఈ మైదానంలో ఇప్పటివరకు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడలేదు. భారత్, ఆస్ట్రేలియా కెప్టెన్లు ఈ రికార్డును దృష్టిలో ఉంచుకుని, వర్షం ప్రభావం పడకముందే తమ ప్రణాళికలను అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఏదేమైనా, వర్షం కారణంగా ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ ఉత్సాహం తగ్గే అవకాశం ఉండటంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

### పిచ్‌పై రోహిత్, గిల్ సుదీర్ఘ సంభాషణ


తొలి వన్డే కోసం రోహిత్ శర్మ ముందుగా పెర్త్ పిచ్‌ను పరిశీలించడానికి వెళ్లారు. అక్కడ భారత జట్టు పర్ఫార్మెన్స్ అనలిస్ట్ హరి ప్రసాద్ మోహన్‌తో కలిసి పిచ్ స్వభావం గురించి మాట్లాడుకుంటుండగా.. కొత్త వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా అక్కడికి వచ్చారు. రోహిత్ శర్మ హరి ప్రసాద్‌తో హరిప్రసాద్ తో సంభాషణను కొనసాగిస్తూనే.. శుభ్‌మన్ గిల్‌కు కూడా పిచ్ పరిస్థితులు, ఆస్ట్రేలియా వాతావరణంలో ఎలా ఆడాలనే దానిపై కొన్ని ముఖ్యమైన విషయాలను వివరించారు. ఈ సంభాషణలో ఇద్దరి మధ్య ఎలాంటి విషయాలు చర్చకు వచ్చాయో తెలియకపోయినా.. రోహిత్ శర్మ ఎంతో ప్రేమగా, ఓ సీనియర్ ఆటగాడిలా, మార్గదర్శకుడిలా సలహాలు ఇవ్వడం.. గిల్ వాటిని ఏకాగ్రతతో చేతులు కట్టుకుని శ్రద్ధగా వినడం చూస్తుంటే వారిద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని, బలమైన బంధం ఉందని స్పష్టమైంది.

## తన్వీ శర్మ సరికొత్త రికార్డు



బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం చేసిన 17 ఏళ్లలో మొదటి భారతీయ మహిళా క్రీడాకారణిగా తన్వీ శర్మ చరిత్ర సృష్టించింది. ఒక గేమ్ లో వెనుకబడిన తర్వాత అద్భుతంగా పుంజుకున్న ఈ 16 ఏళ్ల క్రీడాకారిణి జపాన్‌కు చెందిన సాకి మాత్సుమోటోను ఓడించి బాలికల సింగిల్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. తన్వీ శర్మ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన సాకి మాత్సుమోటోను 47 నిమిషాల్లో 13-15, 15-9, 15-10 తేడాతో ఓడించింది. ఈ విజయంతో తన్వీ పతకం ఖాయమైంది. భారత్‌కు చెందిన మరో క్రీడాకారిణి ఉన్నతి హుడా(ఎనిమిదో సీడ్) సెమీ-ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. ఆమె థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ అన్యాపత్ ఫిచిత్‌ఫోన్ చేతిలో 12-15, 13-15 తేడాతో ఓటమిపాలైంది. (ఉన్నతి హుడా ఒడిశా ఓపెన్ సూపర్ 100 టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలైన భారతీయురాలు, 2022 ఉబెర్ కప్ జట్టులో కూడా సభ్యురాలు). బాలికల డబుల్స్‌లో భారత జంట భవ్యా ఛబ్రా, విశాఖ తోప్పో చైనీస్ తైపీకి చెందిన హుంగ్ బింగ్ ఫు, చౌ యున్ అన్ చేతిలో 9-15, 7-15 తేడాతో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించారు. పురుషుల డబుల్స్‌లో భార్గవ్ రామ్ అరిగెల, విశ్వ తేజ్ గోబురు క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన ఆసియా జూనియర్ ఛాంపియన్స్ చెన్ జున్ టింగ్, లియు జున్ రోంగ్ చేతిలో 12-15, 10-15 తేడాతో ఓటమి పాలయ్యారు. బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జ్ఞాన్ దత్తు కూడా చైనాకు చెందిన మూడో సీడ్ లియు యాంగ్ మింగ్ యూ చేతిలో 15-11, 15-13 తేడాతో ఓడిపోయాడు.

## సిగ్గు లేని పాక్: ఇర్ఫాన్ పఠాన్



అఫ్ఘన్ లక్ష్యంగా వైమానిక దాడులకు పాల్పడిన పాక్‌పై భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ నిప్పులు చెరిగాడు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు పట్ల, ఆ దేశ ఆటగాళ్ల పట్ల పఠాన్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్‌ను షేర్ చేశారు. 'పాకిస్తాన్ వైమానిక దాడుల్లో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ముగ్గురు క్రికెటర్లు మరణించారని తెలిసి చాలా బాధగా ఉంది. ఇది నిజంగా చాలా విచారకరమైన సంఘటన. ఈ దారుణానికి పాకిస్తాన్‌కు సిగ్గుండాలి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పఠాన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పఠాన్ యొక్క ఈ సున్నితమైన, ధైర్యవంతమైన పోస్ట్‌ను అభిమానులు విశేషంగా అభినందించారు.

## ట్రై సిరీస్‌కు అఫ్ఘన్ బాయ్‌కాట్



పాకిస్తాన్ సైన్యం ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో జరిపిన అమానుష వైమానిక దాడుల్లో ముగ్గురు యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడంతో ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ ప్రపంచం శోకసంద్రంలో మునిగిపోయింది. పాకిస్తాన్ సరిహద్దు వెంబడి జరిగిన వైమానిక దాడుల్లో పౌరులు, ముఖ్యంగా ముగ్గురు యువ క్రికెటర్లు మరణించిన నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ.. వచ్చే నెలలో పాకిస్తాన్, శ్రీలంకతో కలిసి జరగాల్సిన ట్రై-సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది.

ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా తన తీవ్ర దుఃఖాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన ప్రకటనలో పౌరులు, మహిళలు, పిల్లలు, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కలలు కంటున్న యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా అనైతికం, అమానుషం. ఈ అన్యాయమైన, చట్టవిరుద్ధమైన చర్యలు మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించాయి. వీటిని విస్మరించకూడదు' అని రషీద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రింకూ సింగ్ ఊచకోత



ఆస్ట్రేలియాతో త్వరలో జరగబోయే కీలకమైన టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ రింకూ సింగ్ దేశీయ క్రికెట్‌లో తన సత్తాను చాటాడు. కాన్పూర్‌లో జరిగిన రంజీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తరఫున ఆడిన రింకూ.. ఆంధ్ర జట్టుపై అసాధారణమైన పోరాట పటిమతో అజేయంగా 165 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ మెగా ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. ఇది కేవలం యూపీ జట్టును కష్టాల నుంచి గట్టెక్కించడమే కాకుండా అక్టోబర్ 29 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌కు ముందు రింకూ అద్భుతమైన ఫామ్‌ను భారత క్రికెట్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టంగా చాటి చెబుతోంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 470 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీనికి బదులివ్వడంలో యూపీకి దారుణమైన ప్రారంభం లభించింది. ఒకానొక దశలో యూపీ జట్టు కేవలం 178 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఇలాంటి అత్యంత క్లిష్టమైన సమయంలో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూ సింగ్ ఓపికతో, పట్టుదలతో క్రీజులో నిలబడ్డాడు. రింకూ సింగ్ దాదాపు 260కి పైగా బంతులు ఎదుర్కొని ఆంధ్ర బౌలర్ల వ్యూహాలను చిత్తు చేశాడు. రింకూ ఈ ఇన్నింగ్స్ కేవలం భారీ షాట్లకే పరిమితం కాకుండా, వికెట్‌ను కాపాడుకోవడానికి, జట్టును పతనం నుంచి నిలబెట్టడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. రింకూ సింగ్‌కు మరో యువ ఆటగాడు విప్రజ్ నిగమ్ (42 పరుగులు) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. వీరిద్దరూ కలిసి ఏడో వికెట్ కోసం 122 పరుగుల అత్యంత ముఖ్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ విలువైన భాగస్వామ్యం కారణంగానే ఉత్తరప్రదేశ్ జట్టు చివరికి 450 పరుగుల మార్కును దాటగలిగింది. మ్యాచ్‌లో తమ పోరాటాన్ని కొనసాగించగలిగింది. ఈ సెంచరీతో రింకూ సింగ్ తన ఫస్ట్-క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 3400 కంటే ఎక్కువ పరుగులు పూర్తి చేసుకున్నాడు. అతని సగటు 55 కంటే ఎక్కువగా ఉంది. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో ఇది అతని 8వ సెంచరీ కావడం విశేషం. రింకూ సింగ్ 22 అర్ధ సెంచరీలు కూడా నమోదు చేశాడు.




## పీసీబీ కక్కుర్తి

అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 17 నుంచి 29 వరకు లాహోర్లో జరగాల్సిన మూడు దేశాల టీ20 టోర్నమెంట్‌కు సంబంధించి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించింది. రాజకీయ ఉద్రిక్తతలు, తీవ్ర ఆరోపణల మధ్య ఆఫ్ఘనిస్తాన్ జట్టు వైదొలిగినా.. ఈ టోర్నమెంట్‌ను ఆపకుండా యథావిధిగా నిర్వహిస్తామని పీసీబీ ధ్రువీకరించింది. ఈ ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలగడానికి ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు బలమైన కారణాన్ని పేర్కొంది. పాకిస్తాన్ వైమానిక దాడుల కారణంగా తమ దేశంలోని పక్టికా ప్రావిన్స్‌లో ముగ్గురు క్రికెటర్లు మరణించారని ఆరోపిస్తూ.. దేశంలో నెలకొన్న తీవ్ర రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ పర్యటనకు రావడం లేదని ఆఫ్ఘనిస్తాన్ నిర్ణయం తీసుకుంది. 'ఆఫ్ఘనిస్తాన్ వైదొలిగినప్పటికీ ట్రై-సిరీస్ ప్రణాళికలో ఎటువంటి మార్పు ఉండదు. నవంబర్ 17 నుంచి టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. ఇప్పటికే శ్రీలంకను మూడో జట్టుగా ఖరారు చేశాం. టోర్నమెంట్ కొనసాగడానికి ఇది సరిపోతుంది' అని పీసీబీ సీనియర్ అధికారి ఒకరు వివరించారు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 19-10-2025 | www.evarthalu.com



# కనిపించని మోసం.. క్రిప్టో కరెన్సీ!

డిజిటల్ ఆకాశంలో మెరిసే నక్కలు,
బిట్‌కాయిన్, ఈథర్ – స్వప్నాల రత్నాలు!
మట్టి కింద మూలుగుతున్న మోసాలు,
క్రిప్టో దుక్కులో దాగిన దెయ్యాలు!
అహంకారం అగ్నిలా, అసూయ ఆకాశంలా ఎగసిపడగలవు
సొమ్ము సాగి, సంపదలు సర్పమైపోగలదు!
జాగ్రత్త నేస్తమా! జారిపడకు క్రిప్టో మాయలో!!

ఇన్వెస్ట్ చెయ్ బ్రో, లక్షలు వచ్చేస్తాయి!.. ఫోన్‌లో మెసేజ్
ఇప్పుడే కొను, లాభాలు గడించు!.. సోషల్ మీడియాలో పోస్ట్
హాయ్ డార్లింగ్, 100 రెట్ల రిటర్న్ గ్యారంటీ!.. వాట్సాప్ చాటింగ్
ప్రైవేట్ కీ ఇవ్వు, మ్యాజిక్ చేస్తా!.. వెబ్‌సైట్‌లో పాపప్
క్లిక్ చెయ్, ఫ్రీ బిట్‌కాయిన్!.. ఫేస్‌బుక్‌లో లింక్
ఎలన్ మస్క్ చెప్పాడు.. ఈ క్రిప్టో కొను!.. ఇన్‌స్టాలో పిక్
ఆశపడితే దురాశల దాహం.. దుఃఖాల దీపం!

**క్రిప్టో కరెన్సీ అనేది డిజిటల్ లేదా వర్చువల్ కరెన్సీ. ఇది క్రిప్టోగ్రఫీ (గుప్త లిపి) ఆధారంగా భద్రతను అందిస్తుంది. సెంట్రలైజ్డ్ అథారిటీలు (ప్రభుత్వాలు లేదా బ్యాంకులు) లేకుండా డీసెంట్రలైజ్డ్ నెట్‌వర్క్‌లపై పనిచేస్తుంది. ఇది బ్లాక్‌చైన్ టెక్నాలజీపై ఆధారపడి, లావాదేవీలను రికార్డ్ చేస్తుంది. క్రిప్టో కరెన్సీ ఆలోచన 1980లలో మొదలైంది. 1983లో డేవిడ్ చామ్ ఈక్యాష్ అనే క్రిప్టోగ్రాఫిక్ ఎలక్ట్రానిక్ మనీని ప్రతిపాదించాడు. 1990లలో వెయ్ డై 'బి-మనీ', నిక్ స్జాబో 'బిట్ గోల్డ్' వంటివి తెరపైకి వచ్చాయి. 2008లో సతోషి నాకమోటో అనే పేరుతో రహస్యంగా ఉన్న వ్యక్తి లేదా సమూహం 'బిట్‌కాయిన్: అ పీర్-టు-పీర్ ఎలక్ట్రానిక్ క్యాష్ సిస్టమ్' వైట్‌పేపర్ ప్రచురించింది. 2009లో మొదటి బిట్‌కాయిన్ లావాదేవీ జరిగింది. 2021లో ఎల్‌సాల్వడార్ బిట్‌కాయిన్‌ను చట్టబద్ధ ముద్రగా ఆమోదించింది. భారత్‌లో దీనిపై ప్రభుత్వం నియంత్రణ పెట్టింది.**



## క్రిప్టో కరెన్సీ స్వరూపం

బిట్ కాయిన్‌గా పిలిచే క్రిప్టో కరెన్సీ 25 నుంచి 50 అంకెలు, అక్షరాలతో కూడిన వాలెట్ అడ్రస్ రూపంలో ఉంటుంది. కేవలం ఈ వాలెట్ అడ్రస్ ఆధారంగా క్రిప్టో కరెన్సీ ఏ వాలెట్‌లో ఉందో గుర్తించడం సాధ్యం కాదు. నిందితుల ఫోన్‌లో ఆ వాలెట్ ఉండి, అందులో వాలెట్ అడ్రస్ దొరికితేనే ఆ కరెన్సీ, దాని విలువ తెలుస్తుంది. వాలెట్ ఉన్న ఫోన్‌ను సీజ్ చేసినంత మాత్రాన క్రిప్టో కరెన్సీని సీజ్ చేసినట్లు కాదు. ఓ వినియోగదారుడు క్రిప్టో కరెన్సీ వాలెట్ అడ్రస్‌ను పోగొట్టుకుంటే దాన్ని రిట్రైవ్ చేసుకోవడానికి రెండు పద్ధతులు ఉంటాయి. కస్టోడియన్ వాలెట్స్‌లో క్రిప్టో కరెన్సీని కేవైసీ ద్వారా, నాన్ కస్టోడియన్ వాలెట్స్‌లో 12 పదాలతో కూడిన '12 వర్డ్ పాస్ ఫేజ్', ఎంపిక చేసుకున్న ప్రశ్నలు-సమాధానాల ద్వారా రిట్రైవ్ చేసుకోవాలి. ఈ విధానంలో సదరు నాన్ కస్టోడియన్ వాలెట్ 12 పదాలను ఓ వరుస క్రమంలో చూపిస్తుంది. దాన్ని రాసుకుని, రహస్యంగా దాచుకునే వినియోగదారుడు.. అవసరమైనప్పుడు క్రిప్టో కరెన్సీ రిట్రైవ్ చేసుకోవడానికి వినియోగిస్తాడు. ఈ పాస్ ఫేజ్ ఎవరి దగ్గర ఉన్నా... దాన్ని వినియోగించి క్రిప్టో అసెట్స్‌ను రిట్రైవ్ చేసుకోవచ్చు.

## చదువుకున్నోళ్లే మోసపోతున్నారు!

యువత, అమాయక ప్రజలే లక్ష్యంగా క్రిప్టో కరెన్సీ, మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరిట నిర్వాహకులు ప్రలోభాల వల విసురుతున్నారు. మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతూ భారీగా పెట్టుబడులు పెట్టిస్తున్నారు. వీటిపై అవగాహన లేని యువత, అమయాకులు పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోతున్నారు. బాధితుల్లో కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు పరువు పోతుందని సైలెంట్‌గా ఉంటున్నారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బయటపడ్డ మోసం కళ్లు తెరిచే జాగ్రత్త చూపింది. మెటాఫండ్ ప్రో యాప్ ద్వారా దాదాపు రూ.60 కోట్లు విదేశాలకు తరలించినట్లు సమాచారం. వాస్తవానికి, కొన్నేండ్లుగా ఆన్‌లైన్ వేదికగా క్రిప్టో కరెన్సీ, మల్టీ లెవెల్ మార్కెటింగ్, మెటా ఫండ్ ప్రో యాప్‌లతో మోసాలు పెరిగాయి. యూనిటీ మెటా, రెక్సోస్, మెటా ఫండ్, అల్టిమా వంటి సంస్థలు క్రిప్టో కరెన్సీ పేరుతో మల్టీ లెవల్ మార్కెటింగ్ బిజినెస్ నిర్వహిస్తున్నాయి. ఆన్‌లైన్ యాప్‌ల సాయంతో పెట్టుబడులు స్వీకరించి, అధిక లాభాలు, విదేశీ టూర్ల ప్రలోభాలతో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. డాలర్ల రూపంలో ఆదాయం, కొత్త సభ్యులను చేర్పిస్తే అదనపు కమీషన్, టార్గెట్ పూర్తి చేసిన వారికి దుబాయి, బాలీ, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ టూర్ ఆఫర్లు ఇస్తూ గాలం వేస్తున్నారు. ఈక్రమంలో పదుల సంఖ్యలో ఉన్న ఇన్వెస్టర్లు ఇప్పుడు వేలల్లోకి చేరగా, పలువురు ఇళ్లు, బంగారం, బాండ్లు పెట్టి కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు అమయాకులను అడ్డంగా ముంచేస్తున్నారు. తెలంగాణలో క్రిప్టో కరెన్సీ మోసాలు వేగంగా పెరుగుతున్నాయి. 2024లో మొత్తం 300 కేసులు నమోదైనట్లు ఎన్సీఆర్బీ డేటా ప్రకారం తెలిసింది, 2025లో ఇది మరింత పెరిగిందని విశ్లేషకులు చెప్తున్నారు. హైదరాబాద్ ఐటీ హబ్ కావడంతో, ఫిషింగ్, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లు, మ్యాట్రిమోనియల్ స్కామ్‌లు, ఐడెంటిటీ థెఫ్ట్ వంటి మోసాలు కామన్ అయిపోయాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీసులు చాలా కేసుల్లో అరెస్టులు, రికవరీలు చేశారు. 2024లో తెలంగాణలో 1,20,869 సైబర్ నేరాల బాధితులు ఉండగా, రూ.183 కోట్లను సైబర్ క్రైం పోలీసులు రికవర్ చేశారు. ప్రస్తుతం యాప్‌ల ఆధారంగా జరుగుతున్న సైబర్ నేరాల్లో చాలావరకు చైనీయులే సూత్రధారులుగా ఉంటున్నారు. నేపాల్, చైనా, ఇండోనేసి యా, దుబాయ్ తదితర దేశాల్లో కూర్చుని, ఇక్కడ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. ఏజెంట్ల కమీ షన్ పోగా మిగిలిన దోపిడీ సొమ్ము విదేశాల్లోని ఆ సూత్రధారులకు చేరుతోంది. ఒకప్పుడు ఈ లావాదేవీలన్నీ హవాలా రూపంలో జరిగేవి. కొన్ని దేశాలకు హవాలా కష్టసాధ్యం కావడంతో పాటు ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సూత్రధారులు క్రిప్టో కరెన్సీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక్కడి పాత్రధారుల ఖాతాల్లోకి నగదు వెళ్లిన తర్వాత దాన్ని బిట్ కాయిన్ రూపంలోకి మార్చి తమ వద్దకు వచ్చేలా చేసుకుంటున్నారు.

## ఇటీవల చోటుచేసుకున్న కేసులు:

- ఐడెంటిటీ థెఫ్ట్ రాకెట్(సెప్టెంబర్ 2025): రైతులు, డెలివరీ వర్కర్ల ఐడీలు దొంగిలించి క్రిప్టో ట్రేడింగ్ నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రాలో 9 కేసులు నమోదయ్యాయి. ఇందులో రూ.170 కోట్ల మోసం జరిగినట్లు సమాచారం.
- మ్యాట్రిమోనియల్ స్కామ్ (ఆగస్టు 2025): 'నందితా రెడ్డి' పేరుతో ఫేక్ ప్రొఫైల్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.87.58 లక్షలు మోసపోయాడు.
- సైబర్ స్లేవరీ రాకెట్ (జూన్ 2025) : చైనా లింకులతో ఫేక్ జాబ్ ఆఫర్లు, క్రిప్టో మోసాలు చేశారు. ఈ కేసులో మొహమ్మద్ అజీమ్ అరెస్ట్ అయ్యాడు. జీబీఆర్ క్రిప్టో ప్లాట్‌ఫారమ్ ఫ్రాడ్ (ఫిబ్రవరి 2025): వివిధ జిల్లాల్లో ఇన్వెస్టర్లు దాదాపు రూ.600 కోట్లు మోసపోయారు.
- ట్రాన్స్‌నేషనల్ స్కామ్ (ఫిబ్రవరి 2025): మోర్గాన్ స్టాన్లీ పేరుతో యూకే వాట్సాప్ నంబర్లు, చైనా లింకులు పంపి మోసాలకు పాల్పడ్డారు.
- ప్యాన్-ఇండియా సైబర్ స్కామ్ (జనవరి 2025): డిజిటల్ ఫైనాన్స్ ప్లాట్‌ఫారమ్‌లు ఉపయోగించి మోసాలకు పాల్పడడారు. 74 కేసుల్లో 52 అరెస్టులు నమోదయ్యాయి.

## జాగ్రత్తలు పాటించండి:

- ఎప్పుడూ పెద్ద లాభాలు అని చేసే మాటలను నమ్మవద్దు.
- అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, ఇమెయిల్స్ క్లిక్ చేయవద్దు.
- భారతదేశంలో క్రిప్టో లీగల్ కాదు. అలా అనీ బ్యాన్ కూడా కాదు.
- కేంద్ర ప్రభుత్వం దీని మీద 30 శాతం పన్ను విధిస్తుంది.
- మోసపోయినట్లు తెలిస్తే https://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

## క్రిప్టో మోసాలు

**క్రిప్టోలో పెట్టుబడి పెట్టాలని చెప్పి వంచన చేయడం, లేదా లాభం వాగ్దానం చేసి డబ్బు దోచుకోవడాన్నే క్రిప్టో స్కామ్ అంటారు.**

### 1. పోంజీ స్కామ్

- పెద్ద లాభాలు వస్తాయని చెప్పి ప్రజల దగ్గర నుంచి ఏదేని కంపెనీ క్రిప్టో లేదా డబ్బు తీసుకుంటుంది.
- మొదట కొంతమందికి లాభాలు ఇచ్చి నమ్మకం కలిగిస్తుంది.
- తర్వాత కొత్తవారి డబ్బుతో పాతవారికి చెల్లించి చివరలో మొత్తం డబ్బుతో పారిపోతుంది.

### 2. ఫిషింగ్ స్కామ్

- మీరు వాడే క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లా కనిపించే నకిలీ సైట్ క్రియేట్ చేస్తారు.
- మీరు లాగిన్ డిటేల్స్ ఇస్తే, మీ క్రిప్టో అకౌంట్ దొంగిలిస్తారు.

### 3. ఫేక్ యాప్స్/ఎక్స్‌చేంజ్ స్కామ్స్

- నకిలీ ట్రేడింగ్ యాప్స్ లేదా వెబ్‌సైట్లు వాడాలని చెబుతారు.
- మీరు డబ్బు డిపాజిట్ చేసిన తర్వాత విత్‌డ్రా కాకుండా చేస్తారు.

### 4. సెలబ్రిటీ స్కాం


- సోషల్ మీడియాలో 'ఎలాన్ మస్క్ ఫ్రీ బిట్ కాయిన్ ఇస్తున్నాడు' లాంటి సందేశాలు పంపుతారు.
- మీరు పంపిన క్రిప్టో వెరిఫై కోసం అని చెబుతారు కానీ తిరిగి ఇవ్వరు.

### 5. పంప్ అండ్ డంప్ స్కాం

- ఒక టోకెన్ ధరను తాత్కాలికంగా పెంచి, ప్రజలు కొనగానే పెద్ద ఇన్వెస్టర్లు అమ్మేస్తారు.
- తరువాత ధర పడిపోతుంది, సాధారణ ఇన్వెస్టర్లకు నష్టం.

### 6. రొమాన్స్/ఫ్రెండ్‌షిప్ స్కాం

- సోషల్ మీడియా ద్వారా పరిచయమై, "క్రిప్టోలో పెట్టుబడి పెట్టండి" అని మోసగిస్తారు.
- మొదట చిన్న లాభాలు చూపించి తర్వాత పెద్ద మొత్తంలో డబ్బు దోచుకుంటారు.



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.